మనసులో మాట

KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ఉత్తరాంధ్ర

విశాఖపట్నం	విజయనగరం	అనకాపల్లి
శ్రీకాకుళం	అల్లూరి జిల్లా (పాడేరు)	పార్వతీపురం

శనివారం 28 నవంబర్ 2026 పేజీలు 16

నర్సీపట్నంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ భవనానికి శంకుస్థాపన.....



10

భూ సేకరణకు స్పీడ్.. అభివృద్ధి ప్రాజెక్టులకు ఊపు!



05

పాడేరు జిల్లా ఆసుపత్రిలో
వైద్య సేవలు బేజారు.....!



- అంబులెన్స్ కోసం ఎదురుచూపులు..
- మృత శిశువుతో మూడు రోజుల పాటు గర్భిణి తల్లి నరకయాతన
- ఠాగూర్ సినిమా తరహాలో ఆసుపత్రి వైద్య సేవలు.. గిరిజనుల ప్రాణాలకు భరోసా ఏదీ?


పాడేరు, నవంబర్ 27 (మనసులో మాట):

అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రం పాడేరులోని ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవల తీరుపై మరోసారి తీవ్ర విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గిరిజన ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తున్నామని, ఆసుపత్రిలో అన్ని రకాల వైద్య సదుపాయాలు కల్పిస్తున్నామని అధికారులు చెబుతున్న ప్రకటనలకు క్షేత్రస్థాయిలో పరిస్థితులు భిన్నంగా ఉన్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎనిమిది నెలల గర్భిణి కడుపులో శిశువు మృతి చెందిన ఘటనలో బాధిత కుటుంబం ఎదుర్కొన్న ఇబ్బందులు ఆసుపత్రి నిర్వహణ తీరును ప్రశ్నార్థకం చేస్తున్నాయి. అంబులెన్స్ సౌకర్యం కోసం సైతం నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొనడం ఆందోళన కలిగిస్తోంది.

మూడు రోజుల నిరీక్షణ.. చివరకు విశాఖకు వెళ్లాలని సూచన!

వివరాల్లోకి వెళితే.. ఓ విలేకరి భార్య ఎనిమిది నెలల గర్భిణిగా ఉండగా, కడుపులో శిశువు కదలికలు కనిపించకపోవడంతో ఈ నెల 25వ తేదీన పాడేరు ప్రభుత్వ జిల్లా ఆసుపత్రిలో చేరారు. వైద్య పరీక్షల అనంతరం గర్భంలోని శిశువు మృతి చెందినట్లు వైద్యులు కుటుంబ సభ్యులకు తెలిపినట్లు సమాచారం.

..మిగతా 11 లో



డేటా సెంటర్‌తో అనకాపల్లికి కొత్త కళ....

- 720 మెగావాట్లతో డేటా సెంటర్ ఏర్పాటు
- రూ.15.37 లక్షల కోట్ల పెట్టుబడులకు ఎస్ఐపీబీ ఆమోదం
- 11.70 లక్షల మందికి ఉపాధి అవకాశాలు

ఉత్తరాంధ్ర బ్యూరో చీఫ్ - మనసులో మాట

ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక, ఐటీ రంగాల అభివృద్ధికి ప్రభుత్వం మరింత వేగం పెంచుతోంది. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రముఖ పెట్టుబడుల గమ్యస్థానంగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో భారీ ప్రాజెక్టులకు ఆమోదం తెలుపుతోంది. ఇందులో భాగంగా అనకాపల్లి జిల్లాలో 720 మెగావాట్ల సామర్థ్యంతో భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. మరోవైపు రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డు (ఎస్ఐపీబీ) ఇప్పటి వరకు నిర్వహించిన 24 సమావేశాల్లో 431 ప్రాజెక్టులకు అనుమతులు మంజూరు చేసింది. వీటి ద్వారా రూ.15.37 లక్షల కోట్ల పెట్టుబడులు రాష్ట్రానికి రానుండగా, సుమారు 11.70 లక్షల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. భారీ పెట్టుబడులు, పారిశ్రామిక పార్కులు, ఐటీ కేంద్రాలు, తయారీ పరిశ్రమల ఏర్పాటుతో రాష్ట్ర ఆర్థిక ముఖచిత్రాన్ని

..మిగతా 02 లో

రాష్ట్రంలో పెట్టుబడుల పరంపర పరుగులు పెడుతోంది.. పారిశ్రామిక ప్రగతికి కొత్త ఊపునిస్తోంది. అనకాపల్లిలో 720 మెగావాట్ల సామర్థ్యంతో భారీ డేటా సెంటర్ ఏర్పాటుకు రంగం సిద్ధమవుతోంది. ఇప్పటి వరకు నిర్వహించిన 24 ఎస్ఐపీబీ సమావేశాల్లో 431 ప్రాజెక్టులకు ఆమోదం తెలపడంతో రూ.15.37 లక్షల కోట్ల పెట్టుబడులకు మార్గం సుగమమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రూ.32.5 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు రాగా.. ఇప్పటికే 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యాయి. పెట్టుబడుల వెల్లువతో రాష్ట్ర పారిశ్రామిక ముఖచిత్రం మారనుందగా.. లక్షలాది మందికి ఉపాధి అవకాశాలు అందుబాటులోకి రానున్నాయి.



13

విశాఖ తీరంలో నేవీ విన్యాసాల సందడి.....!

రేగుపాలెం జంక్షన్‌లో ఘోర ప్రమాదం.. విద్యార్థిని మృతి!



04



02

నిరుద్యోగులకు పోలీసు ఉద్యోగాల వరం

- ఏపీలో 1,534 ఎస్ఐ, కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

డేటా సెంటర్‌తో అనకాపల్లికి కొత్త కళ

(మొదటి పేజీ తరువాయి)

మార్చేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు 1,917 సంస్థలు ముందుకొచ్చాయి. ఆయా సంస్థలు మొత్తం రూ.32.5 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ప్రతిపాదనలు సమర్పించాయి. వీటి ద్వారా సుమారు 22.7 లక్షల మందికి ఉపాధి కల్పించే అవకాశం ఉంది. ఈ ప్రతిపాదనల్లో ఇటీవల నవంబరు 12, 13 తేదీల్లో విశాఖపట్నంలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు ద్వారా వచ్చిన పెట్టుబడులు కూడా ఉన్నాయి. ఈ సదస్సులో సుమారు 300 సంస్థలు కుదుర్చుకున్న ఒప్పందాల ద్వారా రూ.8.88 లక్షల కోట్ల పెట్టుబడుల ప్రతిపాదనలు వచ్చాయి. వివిధ రంగాలకు చెందిన పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపుతుండటంతో ప్రభుత్వం అనుమతుల ప్రక్రియను వేగవంతం చేస్తోంది.

ప్రతిపాదనలు, ఒప్పందాలకే పరిమితం కాకుండా పెట్టుబడులను క్షేత్రస్థాయిలో కార్యరూపంలోకి తీసుకురావడంపై ప్రభుత్వం దృష్టి సారించింది. ఇప్పటి వరకు 303 ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యాయి. వీటి



ద్వారా రూ.1.30 లక్షల కోట్ల పెట్టుబడులు కార్యరూపంలోకి వచ్చాయి. ఈ ప్రాజెక్టుల ద్వారా 1.16 లక్షల మందికి ఉద్యోగాలు లభించనున్నాయి. పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన భూములు, మౌలిక సదుపాయాలు, అనుమతులు కల్పిస్తూ పెట్టుబడిదారులకు ప్రభుత్వం సహకరిస్తోంది.

ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల్లో ఆటో మొబైల్, రక్షణ రంగం, ఏరోస్పేస్, వస్త్ర పరిశ్రమలు, పునరుత్పాదక ఇంధనం, పర్యాటకం, ఐటీ తదితర రంగాలకు చెందిన సంస్థలు ఉన్నాయి. కియా ఇండియా, అదానీ ఎంటర్‌ప్రైజెస్, సెయింట్ గోబైన్ ఇండస్ట్రీస్, ఏటీసీ ఏపీ టైర్స్, ఈస్ట్‌మన్ ఎక్స్‌పోర్ట్స్ వంటి సంస్థల పెట్టుబడి ప్రతిపాదనలు రాష్ట్ర పారిశ్రామిక ప్రగతికి దోహదపడనున్నాయి. నంద్యాల, డోన్, శ్రీసత్యసాయి, చిత్తూరు, విజయనగరం, విశాఖపట్నం, కర్నూలు, ప్రకాశం తదితర జిల్లాల్లో వివిధ ప్రాజెక్టులు ఏర్పాటు కానున్నాయి. దీనివల్ల ఒకటి రెండు నగరాలకే పరిమితమైన పారిశ్రామిక అభివృద్ధి ఇతర ప్రాంతాలకూ విస్తరించే అవకాశం ఉంది. విశాఖపట్నంలో ఐటీ రంగ అభివృద్ధికి సంబంధించి ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. మధురవాడలో ఐటీ పార్కు ఏర్పాటుకు విశాఖ రియాలిటీ ప్రైవేట్ లిమిటెడ్‌కు గత ఏడాది నవంబరు 11న అనుమతిస్తూ జారీ చేసిన ఉత్తర్వులను రద్దు చేసింది. ఈ నిర్ణయం ఐటీ పార్కు ఏర్పాటుపై తదుపరి పరిణామాలకు ప్రాధాన్యం సంతరించుకుంది.

రాష్ట్రంలో పెట్టుబడులను ఆకర్షించడం, వాటిని వేగంగా కార్యరూపంలోకి తీసుకురావడం ద్వారా యువతకు స్థానికంగానే ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యంగా అనకాపల్లి డేటా సెంటర్ వంటి భారీ ప్రాజెక్టులు అందుబాటులోకి వస్తే ఉత్తరాంధ్ర ప్రాంతంలో ఐటీ, డిజిటల్ మౌలిక సదుపాయాల అభివృద్ధికి కొత్త ఊతం లభించే అవకాశం ఉంది. అయితే పెట్టుబడుల ప్రతిపాదనలు, ప్రభుత్వ ఆమోదాలు, వాస్తవంగా ప్రారంభమైన ప్రాజెక్టుల మధ్య వ్యత్యాసాన్ని గమనించాల్సి ఉంటుంది. ప్రతిపాదిత పెట్టుబడులన్నీ కార్యరూపం దాల్చినప్పుడే రాష్ట్రానికి ఆశించిన స్థాయిలో పారిశ్రామిక ప్రగతి, ఉపాధి అవకాశాలు అందుబాటులోకి వస్తాయి.

నిరుద్యోగులకు పోలీసు ఉద్యోగాల వరం





విశాఖపట్నం సిటీ, నవంబర్ 27 (మనసులో మాట) :

పోలీసు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 1,534 పోలీసు పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఇందులో 378 ఎస్ఐ, 1,156 కానిస్టేబుల్ పోస్టులు ఉన్నాయి. అర్హులైన అభ్యర్థుల నుంచి డిసెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించనున్నారు. కానిస్టేబుల్ అభ్యర్థులకు వచ్చే ఏడాది జనవరి 31న ప్రిలిమినరీ పరీక్ష నిర్వహించనుండగా, ఎస్ఐ అభ్యర్థులకు ఫిబ్రవరి 28న రాత పరీక్షలు జరగనున్నాయి. ఎస్ఐ పరీక్షలో భాగంగా ఉదయం పేపర్1, మధ్యాహ్నం పేపర్2 నిర్వహించనున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై కిశోర బాలికల ప్రతిజ్ఞ

వి మాడుగుల నవంబర్ 27 మనసులో మాట)



అనకాపల్లి జిల్లా మాడుగుల మండలం ఏం కోడూరు గ్రామంలో శుక్రవారం స్థానిక పాఠశాలలో బాల్య వివాహాల నిర్మూలనపై కిశోర బాలికలకు అవగాహన కల్పించి, వారితో ప్రతిజ్ఞ చేయించారు. చిన్న వయసులో వివాహాలు చేసుకోకుండా ఉండాలనే అంశంపై విద్యార్థినులకు అవగాహన కల్పిస్తూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆర్. రామలక్ష్మి, జి. పద్మావతి, వైద్య ఆరోగ్య శాఖ నుంచి ఎం.ఎల్.హెచ్.పి హేమ, అలాగే ఆశా వర్కర్లు పి. ప్రసన్నలక్ష్మి, బి. భవాని, జె. సత్యమణి పాల్గొన్నారు.

గుండాలపేటలో టీడీపీ అభ్యర్థులకు అదితి విజయలక్ష్మి ప్రచారం

- **సర్పంచ్ అభ్యర్థి రమాదేవికి మద్దతుగా ఎమ్మెల్యే ఇంటింటి ప్రచారం**

విజయనగరం, నవంబర్ 27 (మనసులో మాట) :





స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గ్రామ పంచాయతీల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. ఇందులో భాగంగా విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు శుక్రవారం విజయనగరం మండలం గుండాలపేట గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తెలుగుదేశం పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాండ్రంకి రమాదేవికి మద్దతుగా ఆమె గ్రామంలో పర్యటించి ఓటర్లను కలిశారు. ఈ సందర్భంగా సర్పంచ్ అభ్యర్థి రమాదేవితో పాటు టీడీపీ మద్దతుతో పోటీ చేస్తున్న వార్డు సభ్యులను గ్రామ ప్రజలకు పరిచయం చేస్తూ వారి తరపున ఓట్లు అభ్యర్థించారు. సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేస్తున్న అభ్యర్థులకు తమ అమూల్యమైన ఓటు వేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి గ్రామ ప్రజలను కోరారు. గ్రామ అభివృద్ధిలో స్థానిక ప్రజాప్రతినిధుల పాత్ర కీలకమని పేర్కొంటూ, పార్టీ మద్దతుతో బరిలో ఉన్న అభ్యర్థులకు ప్రజలు తమ మద్దతు తెలియజేయాలని ఆమె విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభ్యర్థులు పాల్గొన్నారు.

అల్లినగరం సర్పంచ్ బరిలో జక్కా శ్రీనివాసరావు



- **వైఎస్సార్‌సీపీ అభ్యర్థికి మాజీ ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ మద్దతు..**
- **భారీ మెజారిటీతో గెలిపించాలని పిలుపు**

రణస్థలం, నవంబర్ 27 (మనసులో మాట):

అల్లినగరం గ్రామ పంచాయతీ సర్పంచ్ ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థిగా జక్కా శ్రీనివాసరావు బరిలో నిలిచారు. ఆయన అభ్యర్థిత్వానికి ఎచ్చెర్ల నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త గొర్లె కిరణ్‌కుమార్ మద్దతు ప్రకటించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో జక్కా శ్రీనివాసరావుకు పార్టీ కండువా కప్పి అభ్యర్థిగా బలపరిచారు. ఈ సందర్భంగా జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ అభ్యర్థిగా జక్కా శ్రీనివాసరావుతో పాటు వైఎస్సార్‌సీపీ మద్దతుతో పోటీ చేస్తున్న వార్డు సభ్యులందరూ భారీ మెజారిటీతో విజయం సాధించాలని గొర్లె కిరణ్‌కుమార్ ఆకాంక్షించారు. గ్రామ అభివృద్ధి, ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఓటర్లు తమ అమూల్యమైన ఓటును వినియోగించాలని కోరారు. అల్లినగరం గ్రామ ఓటర్లు సర్పంచ్ అభ్యర్థి జక్కా శ్రీనివాసరావుకు కేటాయించిన ఉంగరం గుర్తుపై, అలాగే వార్డు సభ్యుల గుర్తులపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థులను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గ్రామంలో పార్టీ శ్రేణులు సమష్టిగా పనిచేసి అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణపై కలెక్టర్ సమీక్ష.....

- **ఎన్నికలను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి**

నక్కపల్లి, నవంబరు 27 (మనసులో మాట):





గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో అధికారులు సమన్వయంతో పనిచేస్తూ ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జాయింట్ కలెక్టర్ సౌర్యమాన్ పటేల్ అధికారులను ఆదేశించారు. నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం నక్కపల్లి, పాయకరావుపేట మండలాలకు చెందిన స్టేజ్2 రిటర్నింగ్ అధికారులతో వారు ఎన్నికల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల విధివిధానాలు, అధికారుల బాధ్యతలు, పోలింగ్ ఏర్పాట్లు, ఎన్నికల నిర్వహణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దిశానిర్దేశం చేశారు. ఎన్నికల నియమావళిని ఖచ్చితంగా పాటిస్తూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా విధులు నిర్వర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ అధికారి, జిల్లా డీడబ్ల్యూఎంఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆర్ పూర్ణిమ దేవి, జిల్లా సర్వే ఏడీ, జిల్లా మత్స్యశాఖ అధికారి, రెవెన్యూ డివిజనల్ అధికారి, నక్కపల్లి, పాయకరావుపేట మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తాం!





- కూటమి అభ్యర్థులకు మద్దతుగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విస్తృత ప్రచారం
- యువతకు ఉపాధి.. మౌలిక సదుపాయాల కల్పనకు భరోసా

విజయనగరం, నవంబర్ 27
(మనసులో మాట) :

స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో గజపతినగరం నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ విస్తృత ప్రచారం నిర్వహించారు. బొండపల్లి, గజపతినగరం మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించి కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థులకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా గ్రామాల అభివృద్ధికి చేపట్టిన పనులను వివరించడంతో పాటు, ప్రజలకు పలు హామీలు ఇచ్చారు. బొండపల్లి మండలం అంబటివలస గ్రామంలో కూటమి బలపరిచిన సర్పంచ్ అభ్యర్థి పాలురు నీలా వెంకట సురినాయుడుకు మద్దతుగా మంత్రి ప్రచారం నిర్వహించారు. గ్రామంలో పాఠశాల అభివృద్ధి, డ్రైనేజీ వ్యవస్థ, రహదారుల నిర్మాణం, ఎస్సీ కాలనీలో మౌలిక సదుపాయాల కల్పనకు ఇచ్చిన హామీలను త్వరలోనే నెరవేరుస్తామని స్పష్టం చేశారు. ఉద్యోగులపై రాజకీయాలు చేయడం సరికాదని పేర్కొంటూ, గ్రామానికి వచ్చే పరిశ్రమలు, కంపెనీలకు పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ఉద్యోగాల పంపిణీలో అందరికీ సమాన ప్రాధాన్యం కల్పిస్తామని భరోసా ఇచ్చారు. గ్రామ అభివృద్ధి, యువత భవిష్యత్తు బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు. గజపతినగరం మండలం కెంగువ గ్రామంలో కూటమి సర్పంచ్ అభ్యర్థి మజ్జి విమలకు మద్దతుగా మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు. సుమారు 60 ఏళ్ల నాటి పాఠశాల భవనాల స్థానంలో రూ.1.20 కోట్ల వ్యయంతో నూతన భవనాన్ని కేవలం 100 రోజుల్లోనే నిర్మించి అందుబాటులోకి తీసుకొచ్చామని తెలిపారు. స్మశానవాటికకు రహదారి నిర్మాణం, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించడంతో పాటు దేవాలయ అభివృద్ధికి రూ.20 లక్షలు అందించినట్లు వివరించారు. మహిళల ఆర్థిక సాధికారతకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని, 'మన డబ్బులు మన లెక్కలు' కార్యక్రమం ద్వారా డ్వాక్రా మహిళల్లో ఆర్థిక అవగాహన, మార్పు తీసుకొస్తున్నామని పేర్కొన్నారు. గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు మహిళలు, యువత అభ్యున్నతికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. ఈ పర్యటనల్లో టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యురాలు గంట్యాడ శ్రీదేవి, మండల స్థాయి నాయకులు, కూటమి నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి కూటమి అభ్యర్థులను గెలిపించాలని మంత్రి ప్రజలను కోరారు.

అసమానతల నిర్మూలనకు కృషిచేసిన మహనీయుడు కనకదాసు

- జిల్లా రెవెన్యూ అధికారి సత్తిబాబు

విజయనగరం, నవంబర్ 27
(మనసులో మాట) :



సామాజిక తత్వవేత్తగా, స్వరకర్తగా తన రచనలు, కీర్తనల ద్వారా సమాజంలోని అసమానతల నిర్మూలనకు కృషి చేసిన మహనీయుడు శ్రీ భక్త కనకదాసు అని జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్. సత్తిబాబు కొనియాడారు. కనకదాస జయంతి సందర్భంగా శుక్రవారం కలెక్టరేట్‌లోని జిల్లా బీసీ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి డీఆర్వో పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డీఆర్వో మాట్లాడుతూ, కుల, మత భేదాలు లేని సమసమాజ స్థాపన కోసం కనకదాసు చేసిన కృషి నేటి తరానికి ఎప్పటికీ స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఆయన బోధనలు, కీర్తనలు మానవత్వాన్ని, సమానత్వాన్ని చాటిచెబుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమాధికారిణి జ్యోతిశ్రీ, ఇతర సంక్షేమాధికారులు, కార్యాలయ సిబ్బంది పాల్గొని కనకదాసు చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు.

బాల్యవివాహాల నిర్మూలనకు సమష్టి కృషి అవసరం

- విద్యతోనే బాలికలకు ఉజ్వల భవిష్యత్తు
- డీసీపీవో డాక్టర్ కె. హరికృష్ణ
- బాల్యవివాహ రహిత భారత్‌పై 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు

విశాఖపట్నం, నవంబర్ 27
(మనసులో మాట) :





బాల్యవివాహాలు బాలికల విద్య, ఆరోగ్యం, స్వేచ్ఛ, వ్యక్తిగత అభివృద్ధితో పాటు వారి భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, వాటిని పూర్తిస్థాయిలో నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా బాలల సంరక్షణ అధికారి (డీసీపీవో) డాక్టర్ కె. హరికృష్ణ పిలుపునిచ్చారు. బాల్యవివాహాలకు దూరంగా ఉంటూ విద్యను ఆయుధంగా చేసుకుని జీవితంలో ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలని బాలికలకు సూచించారు. అంతర్జాతీయ బాల్యవివాహ నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల సంరక్షణ విభాగం ఆధ్వర్యంలో భీమునిపట్నంలోని కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయం (కేజీబీవీ)లో శుక్రవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ బాల్యవివాహాల కారణంగా బాలికలు విద్యకు దూరమవడమే కాకుండా ఆరోగ్యపరమైన సమస్యలు, మానసిక ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందన్నారు. బాల్యవివాహ నిషేధ చట్టంపై ప్రతి ఒక్కరికీ అవగాహన ఉండాలని పేర్కొన్నారు. బాలికలు తమ హక్కులు, వ్యక్తిగత భద్రత పట్ల అప్రమత్తంగా ఉండాలని, చదువును మధ్యలో ఆపకుండా కొనసాగిస్తూ స్వతంత్రంగా నిర్ణయాలు తీసుకునే స్థాయికి ఎదగాలని సూచించారు. కేంద్ర మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా అమలు చేస్తున్న 'బాల్యవివాహ రహిత భారత్' (బాల్ వివాహ్ ముక్త్ భారత్) కార్యక్రమంలో భాగంగా 100 రోజుల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు డిసెంబర్ 21 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఎక్కడైనా బాల్యవివాహం జరిగే అవకాశం ఉందని తెలిసినా, అలాంటి ప్రయత్నాలు జరుగుతున్నా వెంటనే 1098 చైల్డ్ హెల్ప్‌లైన్‌కు సమాచారం అందించాలని సూచించారు. బాల్యవివాహాల నివారణ ప్రభుత్వ శాఖల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ప్రొటెక్షన్ ఆఫీసర్ దాసరి చంద్రశేఖర్ మాట్లాడుతూ బాల్యవివాహం బాలల ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే కాకుండా వారి విద్య, స్వేచ్ఛ, ఆరోగ్యం, భవిష్యత్తును దెబ్బతీస్తుందని వివరించారు. బాల్యవివాహ నిషేధ చట్టంలోని నిబంధనలను విద్యార్థులకు తెలియజేశారు. బాలికలు చదువుకు ప్రాధాన్యతనిస్తూ స్వయం సమర్థులుగా ఎదగాలని ఆకాంక్షించారు. బాల్యవివాహ రహిత సమాజ నిర్మాణానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, ప్రజలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, వాటి నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులతో బాల్యవివాహ వ్యతిరేక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల సంరక్షణ విభాగం సోషల్ వర్కర్ కె. నరేంద్ర, చైల్డ్ హెల్ప్‌లైన్ కేస్ వర్కర్లు భవిత, ఎల్లయ్య, కేజీబీవీ ప్రిన్సిపాల్ కుమారి గంగ, పాఠశాల సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాజీ 'ఎంపీటీసీ'కి మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి పరామర్శ

కొయ్యూరు, నవంబర్ 27
(మనసులో మాట):







మూడు రోజుల క్రితం పిట్టాచలం, కాకరపాడు గ్రామాల మధ్య ద్విచక్ర వాహనంతో వెళ్తుండగా బైక్ స్కిడ్ అయి చింతలపూడి మాజీ ఎంపీటీసీ పొడుగు రత్నం కుమారుడు అక్కడికక్కడే మృతి చెందాడు.మృతుడు కొయ్యూరు మండలం ఎం. మాకవరం గ్రామానికి చెందిన యువకుడు.ఈ మేరకు శుక్రవారం అరకు మాజీ ఎంపీ గొడ్డేటి మాధవి మృతుడి స్వగ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పి, తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

ప్రమాదకరంగా మారిన రహదారి గొయ్యి.. చెట్టు కొమ్మలే హెచ్చరిక!

- రెండు నెలలుగా వాహనదారుల అవస్థలు..
- నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామన్న ఆర్ అండ్ బి ఏఈ

వి.మాడుగుల నవంబర్ 27
(మనసులో మాట)





అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండల కేంద్రంలోని మాడుగుల గ్రామం నుండి ఘాట్ రోడ్డు సెంటర్‌కు వెళ్లే ప్రధాన రహదారిపై ఆర్ అండ్ బి బంగ్లా, ఫైర్ స్టేషన్ సమీపంలో రోడ్డు మధ్యలో ఏర్పడిన భారీ గొయ్యి వాహనదారులకు పెను ప్రమాదకరంగా మారింది. సుమారు రెండు నెలల క్రితం ఈ రహదారి మధ్యలో గొయ్యి ఏర్పడింది. ఇది చాలా లోతుగా ఉండటమే కాకుండా, రాళ్లు తేలి ఉండటంతో ద్విచక్ర వాహనాలు, ఇతర వాహనాలు అదుపుతప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొంది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల స్పందన లేకపోవడంతో స్థానికులు, బాటసారులు ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఆ గొయ్యిలో ఎండు చెట్టు కొమ్మలను పాతి, దూరం నుంచే వాహనదారులకు ప్రమాద హెచ్చరికగా కనిపించేలా ఏర్పాటు చేశారు. ఏదైనా పెను ప్రమాదం జరగకముందే సంబంధిత అధికారులు తక్షణమే రహదారి మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఈ సమస్యపై వి.మాడుగుల రోడ్లు, భవనాల శాఖ ఏఈ శ్రీనివాస్‌ను సంప్రదించగా ఆయన స్పందించారు. గతంలోనే ఈ గొయ్యిని సిమెంట్‌తో తాత్కాలికంగా పూడ్చడం జరిగిందని, అయితే అక్కడ పూర్తిస్థాయిలో పునర్నిర్మాణం (రీకన్‌స్ట్రక్షన్) చేయాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఇందుకు సంబంధించి ఇప్పటికే ఎస్టిమేషన్ (అంచనాలు) రూపొందించి ఉన్నతాధికారులకు పంపించామని, నిధులు మంజూరు కాగానే పనులు చేపడతామని ఏఈ వివరించారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రేగుపాలెం జంక్షన్‌లో ఘోర ప్రమాదం.. విద్యార్థిని మృతి!

- ప్రమాద స్థలాన్ని పరిశీలించిన హోంమంత్రి అనిత..
- జంక్షన్ వద్ద తక్షణమే సిగ్నల్ ఏర్పాటు చేయాలని ఆదేశం





ఎలమంచిలి, నవంబర్ 27 (మనసులో మాట):

జాతీయ రహదారిపై జరిగిన ఘోర రోడ్డు ప్రమాదం ఓ కళాశాల విద్యార్థిని ప్రాణాలను బలిగొంది. ఎలమంచిలి మండలం రేగుపాలెం జంక్షన్ వద్ద శుక్రవారం జరిగిన ఈ ప్రమాదంలో బీఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న కళ్ళెం నాగ శ్రీలక్ష్మి (18) తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ మృతి చెందింది. అదే బైక్‌పై ప్రయాణిస్తున్న మట్టా అప్పలరాజు తీవ్ర గాయాలతో ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మన్యంపాలెం గ్రామానికి చెందిన నాగ శ్రీలక్ష్మి, మట్టా అప్పలరాజు ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నారు. రేగుపాలెం జంక్షన్ వద్ద జాతీయ రహదారిని దాటే క్రమంలో బైక్ ఆగి ఉండగా, అదే సమయంలో అటుగా వెళుతున్న లారీలోని ఐరన్ బండిళ్లు జారిపడి బైక్ వెనుక కూర్చున్న శ్రీలక్ష్మిపై పడ్డాయి. దీంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే అనకాపల్లిలోని ఎన్టీఆర్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించినప్పటికీ ఫలితం లేకపోయింది. చికిత్స పొందుతూ ఆమె మృతి చెందింది. బైక్ నడుపుతున్న అప్పలరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. అనకాపల్లి నుంచి పాయకరావుపేట వైపు వెళుతున్న రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత ప్రమాద ఘటనను గమనించి వెంటనే తన వాహనాన్ని ఆపారు. సంఘటన స్థలానికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. గ్రామీణ ఎస్సై ఉపేంద్రను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తరచూ ప్రమాదాలు జరుగుతున్న రేగుపాలెం జంక్షన్ వద్ద భద్రతా ఏర్పాట్లపై ఆరా తీశారు.రేగుపాలెం జంక్షన్ వద్ద వెంటనే సిగ్నల్ పాయింట్ ఏర్పాటు చేయాలని హోంమంత్రి అధికారులను ఆదేశించారు. పోలీసులు, జాతీయ రహదారుల సిబ్బంది సమన్వయంతో పనిచేస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని సూచించారు. జంక్షన్ వద్ద 24 గంటల పాటు పోలీసు గస్తీ నిర్వహించాలని స్పష్టం చేశారు. పాయకరావుపేట, ఎలమంచిలి నియోజకవర్గాల పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రమాదాలకు కారణమవుతున్న బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని హోంమంత్రి సూచించారు.రహదారులపై వాహనదారుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని, ప్రమాదాలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా 'నషా ముక్త్ యువ' 100 రోజుల కార్యక్రమం

పాలకొండ, నవంబర్ 27, మనసులో మాట :



ప్రభుత్వ డిగ్రీ కళాశాల లో ఎన్ఎస్ఎస్ యూనిట్ వన్, టు ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. అప్పారావు అధ్యక్షతన శుక్రవారం 'నషా ముక్త్ యువ' 100 రోజుల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ యువతలో మాదకద్రవ్యాల వినియోగం, చెడు వ్యసనాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానంపై చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు. వైస్.ప్రిన్సిపల్ వి.ప్రభాకర రావు మాట్లాడుతూ... నేటి యువత దేశ భవిష్యత్తుకు వెన్నెముక వంటిదని, యువత మాదకద్రవ్యాలకు, చెడు వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉంటూ తమ విలువైన జీవితాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. స్థానిక ఎస్సై వెంకన్న మాట్లాడుతూ ఆరోగ్యవంతమైన యువతతోనే బలమైన సమాజ నిర్మాణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతను గుర్తించి మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి తమ వంతు కృషి చేయాలని సూచించారు.అనంతరం ఐక్యు ఏసి కోఆర్డినేటర్ మరియు ఎన్ఎస్ఎస్ యూనిట్ 1 పిఓ డా. బి. రాజు మాట్లాడుతూ.. దేశ సమైక్యత, సమగ్రతను కాపాడటం ప్రతి పౌరుడి బాధ్యతని, విద్యార్థులు క్రమశిక్షణ, సేవాభావం, దేశభక్తి వంటి విలువలను అలవర్చుకోవాలని తెలిపారు. అనంతరం విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా సెల్ఫీ పై సంతకాలు చేయించి ప్రతిజ్ఞ చేయించారు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక నష్టాలను వివరిస్తూ అవగాహనర్యాలీనిర్వహించారు.ర్యాలీలో విద్యార్థులు పాల్గొని మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక సిబ్బంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

వాలసి సర్పంచ్ అభ్యర్థి గంగమ్మకు నాయకుల మద్దతు వెల్లువ.. నీరాజనాలు పడుతున్న ఓటర్లు!

అనంతగిరి నవంబర్ 27 మనసులో మాట



అల్లూరి జిల్లా అనంతగిరి మండలం వాలసి గ్రామ పంచాయతీ ఎన్నికల బరిలో నిలిచిన సర్పంచ్ అభ్యర్థి గంగమ్మ ప్రచారం జోరుగా సాగుతోంది. ఆమెకు స్థానిక నాయకుల నుంచి మద్దతు వెల్లువెత్తుతుండగా, మరోవైపు ఓటర్ల నుంచి విశేష ఆదరణ లభిస్తోంది. ఎన్నికల ప్రచారంలో భాగంగా గంగమ్మ ఇంటింటికీ వెళ్లి ఓట్లను అభ్యర్థిస్తుండగా, ఓటర్లు హారతులతో నీరాజనాలు పడుతూ ఘన స్వాగతం పలుకుతున్నారు. గ్రామంలోని పలువురు స్థానిక నాయకులు, వార్డు సభ్యులు, యువజన నేతలు గంగమ్మకు పూర్తి మద్దతు ప్రకటించారు. గ్రామ అభివృద్ధి కోసం ఆమె చేస్తున్న కృషి, ప్రజలతో ఉన్న అనుబంధం దృష్ట్యా గంగమ్మను భారీ మెజారిటీతో గెలిపించుకోవాలని నేతలు పిలుపునిచ్చారు. ప్రచార కార్యక్రమాల్లో నేతలు చురుగ్గా పాల్గొంటూ గంగమ్మ విజయానికి బాటలు వేస్తున్నారు.

ప్రజల స్పందన, సంక్షేమ ఫలాలు హామీలు ఓటర్ల నమ్మకం

గ్రామ పంచాయతీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, తాగునీటి సమస్యలు, వీధి దీపాల ఏర్పాటుకు ప్రాధాన్యత ఇస్తామని గంగమ్మ హామీ ఇచ్చారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు.
సమస్యలపై స్పందించే నాయకురాలిగా గంగమ్మకు ఓటర్లు అండగా నిలుస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో ఆమె గెలుపు ఖాయమనే అభిప్రాయం గ్రామ పంచాయతీలో ఓటర్ల నుండి వ్యక్తమవుతోంది.
ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దూరు గంగన్న దొర ఎంపీటీసీ సేంబి కౌసల్య మాజీ సర్పంచ్సేంబి సన్యాసి రావు డి దుక్కు పి రవికుమార్ చిన్న సాయిరాం జన్ని పందన్న పలువురు నాయకులు, గ్రామస్తులు, మహిళలు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

ట్రైరు పేలి కారులో మంటలు.. డ్రైవర్ సజీవ దహనం

- ఆనందపురం–పెందుర్తి జాతీయ రహదారిపై ఘోర ప్రమాదం



విశాఖపట్నం సిటీ, నవంబర్ 27 (మనసులో మాట) :

జాతీయ రహదారిపై ప్రయాణం చేస్తుండగా అనూహ్యంగా సంభవించిన ప్రమాదం ఓ నిండు ప్రాణాన్ని బలిగొంది. కారు ట్రైరు ఒక్కసారిగా పేలడంతో చెలరేగిన మంటలు క్షణాల్లో వాహనమంతా వ్యాపించాయి. దీంతో డ్రైవర్ మంటల్లో చిక్కుకుని సజీవ దహనమయ్యాడు. విశాఖ జిల్లాలోని ఆనందపురం-పెందుర్తి జాతీయ రహదారిపై గురువారం రాత్రి ఈ దుర్ఘటన చోటు చేసుకుంది. ప్రయాణిస్తున్న కారు ట్రైరు అకస్మాత్తుగా పేలడంతో మంటలు వ్యాపించాయి. చూస్తుండగానే మంటలు కారంతా వ్యాపించడంతో డ్రైవర్ బయటపడలేక ప్రాణాలు కోల్పోయాడు. సమాచారం అందుకున్న ట్రాఫిక్ హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదానికి గల కారణాలపై పరిశీలన చేపట్టారు. మృతుడి వివరాలు తెలియాల్సి ఉండగా, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడికావాల్సి ఉంది.

ఆర్టీసీ డ్రైవర్లకు.. ట్రాఫిక్ పోలీసుల దిశానిర్దేశం

- బాధ్యతాయుత డ్రైవింగ్‌పై మద్దిలపాలెం డిపోలో ట్రాఫిక్ అవగాహన సమావేశం



విశాఖపట్నం సిటీ, నవంబర్ 27 (మనసులో మాట) :

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత. ముఖ్యంగా ప్రజా రవాణా వాహనాలను నడిపే డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనల పట్ల అప్రమత్తంగా ఉండాలి. నిర్లక్ష్యం, అతివేగం, నిబంధనల ఉల్లంఘన ప్రమాదాలకు దారితీస్తున్న నేపథ్యంలో మద్దిలపాలెం ఆర్టీసీ డిపో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. మద్దిలపాలెం ఆర్టీసీ డిపోలో నిర్వహించిన సమావేశంలో ర్యాష్ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్ వల్ల కలిగే ప్రమాదాలు, వాటి పరిణామాలను వివరించారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలను ఉదాహరణలుగా ప్రస్తావిస్తూ రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనల పాటింపు, బాధ్యతాయుత డ్రైవింగ్ ఆవశ్యకతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ టీ. ఉమా మహేశ్వర్ రెడ్డి, ఎంవీపీ ట్రాఫిక్ ఎస్సై రామ్మూర్తి, ద్వారక ట్రాఫిక్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎన్.వి. ప్రభాకర్ పాల్గొన్నారు.సుమారు 100 మంది డిపో డ్రైవర్లు హాజరయ్యారు.

విద్యుత్ కష్టాలకు విముక్తి.. 17వ వార్డు కార్పొరేటర్ గోవింద్ చొరవ

- ఉపశమనం పొందిన విజయదుర్గాదేవి కాలనీ, క్రాంతినగర్ వాసులు.. హర్షం వ్యక్తం చేసిన స్థానికులు



విశాఖపట్నం సిటీ, నవంబర్ 27 (మనసులో మాట) :

విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, తక్కువ వోల్టేజీ సమస్యలు స్థానికులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి 17వ వార్డు కార్పొరేటర్ బుడుమూరి గోవింద్ చొరవ తీసుకున్నారు. విజయదుర్గాదేవి కాలనీ, క్రాంతినగర్ ప్రాంతాల్లో విద్యుత్ అవసరాలకు సరిపడా సరఫరా లేక వోల్టేజీ సమస్యలు తలెత్తుతున్న విషయాన్ని గుర్తించారు. దీంతో విశాలాక్షి నగర్ విద్యుత్ సెక్షన్ ఏఈ శ్వేత దృష్టికి తీసుకెళ్లి, హనుమంతువాక ప్రాంతంలో ట్రాన్స్‌ఫార్మర్ నంబరు 481తో కొత్త ట్రాన్స్‌ఫార్మర్‌ను హుటాహుటిన ఏర్పాటు చేయించారు. ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేరుస్తుండటంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తూ కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గ ఐటీడీపీ అధ్యక్షుడు బాదరు బాలరాజు, వానపల్లి గణేష్, కుప్పిలి ప్రసాద్‌బాబు, బుడుమూరి గోపి, రాయి అప్పాజీ తదితరులు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

దోమల నివారణకు సమష్టి కృషి చేయాలి

- 15వ వార్డు కార్పొరేటర్ ఒమ్మి అప్పలరాజు

విశాఖపట్నం సిటీ, నవంబరు 27 (మనసులో మాట) :



దోమల వ్యాప్తి నివారణకు ప్రజలు, పారిశుద్ధ్య సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని 15వ వార్డు కార్పొరేటర్ ఒమ్మి అప్పలరాజు సూచించారు. ప్రజారోగ్య పరిరక్షణలో పారిశుద్ధ్య నిర్వహణ కీలకమని పేర్కొన్నారు. ఫ్రైడే-డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దుర్గానగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. దోమల వల్ల కలిగే అనారోగ్య సమస్యలు, పారిశుద్ధ్య పరిస్థితులపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. దోమల నివారణకు తగిన చర్యలు చేపట్టాలని మలేరియా సిబ్బందికి సూచించారు. దుర్గానగర్‌లో సీసీ రహదారులు నిర్మించాలని స్థానికులు కోరగా, త్వరలోనే మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తూర్పు మెడికల్ ఆఫీసర్ ప్రసాదరావు, జోన్ మలేరియా ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర రావు, 15వ వార్డు శానిటరీ ఇన్‌స్పెక్టర్ అబ్దుల్, క్లస్టర్ ఇన్‌ఛార్జి గాడి సత్యం, మలేరియా సూపర్‌వైజర్ జగదీశ్వరి, టీడీపీ నాయకులు రవి, బాల శంకరరావు, రామకృష్ణ, దేముళ్లు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు, మలేరియా, పారిశుద్ధ్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఉమ్మలాడ సర్పంచిగా మొల్లేటి శేషు ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలి

- జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్

మునగపాక, నవంబర్ 27, మనసులో మాట



ఉమ్మలాడ గ్రామంలో ఉన్నతమైన కుటుంబంలో పుట్టిన మొల్లేటి శేషు ను సర్పంచ్ అభ్యర్థిగా ప్రజల పూర్తి స్థాయి మద్దతు గెలిపించాలని జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఉమలాడ గ్రామంలో ఇంటింటికి వెళ్లి మొల్లేటి శేషు విజయం కోసం పర్యటించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ మొల్లేటి శేషు గతంలోనే ఎంపీటీసీ సభ్యురాలుగా గ్రామానికి విశేషమైన సేవలు అందించిందని, వైయస్సార్సీపి తరఫున పోటీ చేస్తున్న మొల్లేటి చేసుకో అత్యధిక మెజార్టీ నుంచి భారీ స్థాయిలో గెలిపించాలని ప్రసాద్ ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్సిపి జిల్లా యువజన విభాగం కార్యదర్శి మొల్లేటి వినోద్ పలువురు పాల్గొన్నారు.

విశాఖలో రీజియన్ స్థాయి 'తపాలా అదాలత్'

శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి : నవంబర్ 27: (మనసులో మాట)

విశాఖపట్నం పోస్టల్ రీజియన్ పరిధిలోని తపాలా వినియోగదారుల వ్యక్తిగత ఫిర్యాదులు, సమస్యల పరిష్కారానికి డిసెంబర్ 4వ తేదీన (శుక్రవారం) 'తపాలా అదాలత్' నిర్వహించనున్నట్లు రీజియన్ సహాయ సంచాలకులు 1 ఆర్. నవీన్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. విశాఖపట్నం ఎంవీపీ బస్ కాంప్లెక్స్ పక్కన ఉన్న పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయంలో ఆ రోజు ఉదయం 10 గంటలకు పోస్టుమాస్టర్ జనరల్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరుగుతుందని పేర్కొన్నారు. తపాలా సేవలకు సంబంధించిన ప్రత్యేక వ్యక్తిగత ఫిర్యాదులను మాత్రమే ఈ అదాలత్‌లో చర్చించి పరిష్కరిస్తారని స్పష్టం చేశారు.

శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, విశాఖపట్నం, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లాల పరిధిలోని వినియోగదారులు తమ సమస్యలు, ఫిర్యాదులను డిసెంబర్ 2వ తేదీలోగా పంపాలని కోరారు. దరఖాస్తు కవరుపై "తపాలా అదాలత్" అనే శీర్షిక రాసి, " కె.వి.డి. సాగర్, అసిస్టెంట్ డైరెక్టర్, పోస్టు మాస్టర్ జనరల్ వారి కార్యాలయం, విశాఖపట్నం 530017" అనే చిరునామాకు పంపాలని సూచించారు. గడువు తేదీ తర్వాత వచ్చే దరఖాస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీకరించబోమని సహాయ డైరెక్టె నవీన్ కుమార్ వెల్లడించారు.

భూసేకరణకు స్పీడ్.. అభివృద్ధి ప్రాజెక్టులకు ఊపు!

- మూడు నెలల్లో పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీ పూర్తి చేయాలి
- డిసెంబర్ 15లోగా రీ-సర్వే ఫేజ్-6కు ముగింపు
- 17 కీలక ప్రాజెక్టుల భూసేకరణపై కలెక్టర్ సమీక్ష

విజయనగరం, నవంబర్ 27 (మనసులో మాట) ::





జిల్లాలో భూ రికార్డుల ప్రక్షాళన, రైతుల భూ సమస్యల పరిష్కారం, అభివృద్ధి ప్రాజెక్టులకు అవసరమైన భూసేకరణను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాం సుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ సేదు మాధవన్‌తో కలిసి నిర్వహించిన సమీక్షలో రెవెన్యూ, సర్వే, భూసేకరణ శాఖల పనితీరును పరిశీలించారు. జిల్లాలోని 983 గ్రామాలకు గాను ఇప్పటికే 755 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని, మిగిలిన ఫేజ్ 6 ప్రక్రియను డిసెంబర్ 15లోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఫేజ్ 6లో 103 గ్రామాలకు సంబంధించి 72,146.11 ఎకరాల్లో గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందని, పెండింగ్ పనులను వేగవంతం చేయాలని సూచించారు. రైతులకు పట్టాదారు పాస్‌పుస్తకాల పంపిణీని రాబోయే మూడు నెలల్లో అన్ని అర్హమైన గ్రామాల్లో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇప్పటివరకు రెండు విడతల్లో 755 గ్రామాల్లో మొత్తం 3,98,719 పాస్‌పుస్తకాలు పంపిణీ చేసినట్లు అధికారులు వివరించారు. మ్యుటేషన్ దరఖాస్తులను గడువులోగా పరిష్కరించి, ఆమోదం పొందిన వాటికి ఈకేవైసీ పూర్తి చేసి రైతులకు ప్రింటెడ్ కాపీలు అందించాలని సూచించారు. రెవెన్యూ సేవలపై ప్రజల సంతృప్తి పెంచాలని, ప్రస్తుతం 36.18 శాతంగా ఉన్న సానుకూల స్పందనను జనవరి నాటికి 80 శాతానికి చేర్చాలని లక్ష్యంగా నిర్దేశించారు. జిల్లాలో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గిగా స్కేల్ ఏఐ డేటా సెంటర్, భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీ సహా 17 ప్రధాన అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిని సమీక్షించారు. భోగాపురం ఏఐ డేటా సెంటర్‌కు సంబంధించి 889.29 ఎకరాల భూసేకరణ ప్రతిపాదనలను పరిశీలించి, తదుపరి ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. సెంట్రల్ ట్రైబల్ యూనివర్సిటీకి అవసరమైన 565.46 ఎకరాల్లో 561.91 ఎకరాలు ఇప్పటికే సేకరించి అప్పగించినట్లు అధికారులు తెలిపారు. భోగాపురం విమానాశ్రయానికి సంబంధించి 2,752.51 ఎకరాల భూమిని సేకరించి అప్పగించగా, మిగిలిన పరిహారం, కోర్టు కేసులు, ఇతర పనులను త్వరగా పరిష్కరించాలని కలెక్టర్ సూచించారు. తారకరామ తీర్థసాగరం, తోటపల్లి బ్యారేజ్, జాతీయ రహదారులు, రైల్వే మూడో, నాలుగో లైన్లు, 17 రోడ్ ఓవర్ బ్రిడ్జిల భూసేకరణపై కూడా సమీక్షించారు. అవార్డులు ఆమోదం పొందినప్పటికీ నిధుల కొరతతో రైతులకు పరిహారం చెల్లింపుల్లో జాప్యం జరగడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. రైతులకు చట్టబద్ధంగా అందాల్సిన పరిహారాన్ని సకాలంలో చెల్లించేలా ప్రతిపాదనలు పంపాలని, కోర్టు కేసులు, ఆర్బిట్రేషన్ అంశాలను నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు. పారిశ్రామిక అభివృద్ధికి ల్యాండ్ బ్యాంక్ ఏర్పాటు, ఏపీఐఐసీకి భూముల అప్పగింత, నేవల్ ఆర్మమెంట్ డిపో, గ్రేహౌండ్స్ శిక్షణ కేంద్రం, వ్యర్థాల శుద్ధి ప్లాంట్లకు భూముల గుర్తింపును వేగవంతం చేయాలని సూచించారు. 22ఏ నిషేధిత భూముల జాబితా నుంచి తొలగింపునకు వచ్చిన 480 దరఖాస్తుల్లో 141 ఆమోదించగా, 292 తిరస్కరించినట్లు, మరో 47 పెండింగ్‌లో ఉన్నట్లు అధికారులు తెలిపారు. అర్హులైన రైతుల భూ సమస్యలను రికార్డుల ఆధారంగా పారదర్శకంగా పరిష్కరించి, ప్రతి ప్రాజెక్టుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికతో తదుపరి సమీక్షకు స్పష్టమైన పురోగతితో రావాలని కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, ఆర్డీవోలు, ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లు, సర్వే, భూసేకరణ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మరమ్మతులకే పరిమితమైన చీడిపుట్టు వంతెన.. ప్రమాదాల అంచున ప్రయాణాలు..







- నూతన వంతెన నిర్మాణంపై అధికారుల నిర్లక్ష్యం..
- గతంలో తుఫాన్ కారణంగా వంతెన కంపలతో అడ్డు కాటు వేసిన దృశ్యం

హుకుంపేట నవంబర్ 27 మనసులో మాట

హుకుంపేట మండలంలోని చీడిపుట్టు వంతెన నిర్మాణం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. సుమారు 50 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన తుఫాన్లు, భారీ వర్షాల ప్రభావంతో పలుమార్లు దెబ్బతిన్నప్పటికీ నేటికీ మరమ్మతులకే పరిమితమైంది. నూతన వంతెన నిర్మాణానికి మాత్రం ఇంతవరకు కార్యరూపం దాల్చకపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు మరమ్మతులు చేపట్టినప్పటికీ వంతెన పరిస్థితిలో పూర్తిస్థాయి మార్పు కనిపించడం లేదు. వంతెన ప్రమాదకరంగా మారిందని తెలిసినా సంబంధిత అధికారులు కనీసం హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. ప్రతిరోజూ వందలాది వాహనాలు ఈ వంతెన మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఎన్నిసార్లు జిల్లా కలెక్టర్లు పర్యటించినా, ప్రజాప్రతినిధులు పర్యవేక్షించినా నూతన వంతెన నిర్మాణానికి అవసరమైన నిధులు, ప్రతిపాదనలు ముందుకు రాకపోవడం పట్ల ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వంతెన మీదుగా అడ్డుమండ, జీకే మండ, బారామసి గ్రామాలతో పాటు పాడేరు మండలంలోని మోదపుట్టు తదితర పంచాయతీలకు చెందిన సుమారు 10 వేల మందికి పైగా ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. ముఖ్యంగా పాడేరు మోదకొండమ్మ ఉత్సవాల సమయంలో ఇదే మార్గంలో బస్సులు సైతం ప్రయాణిస్తుంటాయి. ఈ ప్రాంత ప్రజలకు ఇదే ప్రధాన రహదారి కావడంతో నిత్యం రద్దీగా ఉంటుంది. హుకుంపేట మీదుగా ప్రత్యామ్నాయ మార్గంలో ప్రయాణించడం సులభం కాకపోవడంతో ప్రజలు తప్పనిసరి పరిస్థితుల్లో ప్రమాదకరమైన వంతెనపైనే ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు ముప్పు పొంచి ఉన్నప్పటికీ సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోకపోవడం బాధాకరమని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో ఎన్నికల సమయంలో కనిపించే ప్రజాప్రతినిధులు, సర్పంచులు, ఎంపీటీసీలు ఇలాంటి ప్రధాన సమస్యలపై చొరవ చూపకపోవడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి చీడిపుట్టు వంతెనను పరిశీలించి, నూతన వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేయాలని, అప్పటివరకు ప్రమాద నివారణ చర్యలు చేపట్టాలని ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రెవెన్యూ సేవల విస్తరణ.. సమస్యల పరిష్కారంలో జిల్లా ముందంజలో ఉండాలి

- వారాంతపు లక్ష్యాలు నిర్దేశించుకుని పనిచేయాలి..
- ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలి
- భీమిలి, విశాఖ రెవెన్యూ డివిజన్ల కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్





విశాఖపట్నం, నవంబర్ 27 (మనసులో మాట) :

ప్రజలకు రెవెన్యూ సేవలను నిర్ణీత గడువు లోగా, పారదర్శకంగా, ఎలాంటి జాప్యం లేకుండా అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ ఆదేశించారు. రెవెన్యూ సేవలందించడంలో నిర్లక్ష్యం వహించే అధికారులను ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. రెవెన్యూ సేవల విస్తరణ, ప్రజా సమస్యల పరిష్కారంలో విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలిచేలా ప్రతి అధికారి పనిచేయాలని సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశాఖపట్నం, భీమునిపట్నం రెవెన్యూ డివిజన్ల అధికారులతో నిర్వహించిన సమావేశాల్లో జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరితో కలిసి వివిధ రెవెన్యూ అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు అందించాల్సిన సాధారణ రెవెన్యూ సేవలకు ఇతర పనుల కారణంగా ఎట్టి పరిస్థితుల్లోనూ అంతరాయం కలగకూడదన్నారు. వారాంతపు లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి పురోగతిని ఆర్డీవో స్థాయిలో ప్రతి వారం సమీక్షించాలని ఆదేశించారు. నిర్ణీత సమయంలో సర్వీస్ సర్టిఫికెట్లను జారీ చేయాలని, ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితి రాకుండా చూడాలన్నారు. ఎఫ్.లైన్ పిటిషన్లను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని, 90 రోజుల గడువుతో కూడిన హౌస్ సైట్ దరఖాస్తులు, ఆన్‌లైన్ సేవలను నిబంధనల ప్రకారం త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. దరఖాస్తుల పరిశీలన, క్షేత్రస్థాయి విచారణలో నాణ్యత పాటించాలని, 22.ఏ భూములకు సంబంధించిన సమస్యలను కూడా నిబంధనల మేరకు పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలాల వారీగా ఉన్న బల్క్ సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ రూపొందించాలని సూచించారు. గృహ నిర్మాణ పథకాల కింద నిర్మిస్తున్న కాలనీల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు చేపట్టాలని, భీమిలిలో మహాత్మా జ్యోతిబా పూలే బాలికల పాఠశాల భవన నిర్మాణానికి అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రజోపయోగ ప్రాజెక్టులకు సంబంధించిన భూ కేటాయింపులు, అనుమతులు, ఇతర సాంకేతిక ప్రక్రియలను సకాలంలో పూర్తి చేయాలన్నారు. మారిన నిబంధనల ప్రకారం మ్యుటేషన్ పూర్తయిన వెంటనే సంబంధిత రైతుకు అడంగల్ కాపీ అందజేయాలని కలెక్టర్ తెలిపారు. ఈ ప్రక్రియలో వీఆర్వోలు ఈకేవైసీ పూర్తి చేయాలన్నారు. భూముల రీ సర్వే ప్రక్రియను సజావుగా నిర్వహించాలని, సర్వే పూర్తయిన గ్రామాల్లో పట్టాదారు పాస్ పుస్తకాలను పంద శాతం పంపిణీ చేయాలన్నారు. పాస్ పుస్తకాల్లో ఏవైనా సవరణలు ఉంటే వాటిని వేగంగా పరిష్కరించాలన్నారు. రెవెన్యూ శాఖకు సంబంధించిన కోర్టు కేసుల విషయంలో అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని కలెక్టర్ ఆదేశించారు. వాస్తవ వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని, కేసుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. లీగల్ సెల్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలన్నారు. గతంలో వెలువడిన తీర్పులు, సంబంధిత పూర్వ కేసులను పరిశీలించి తదనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. సమావేశంలో డీఆర్వో ఎస్. డి. అనిత, ఆర్డీవోలు దిలీప్ చక్రవర్తి, సంగీత్ మాధుర్, డిప్యూటీ కలెక్టర్లు గోవిందు, మధుసూదన్ రావు, ఎస్టేట్ ఆఫీసర్ దయానిధి, సోషల్ వెల్ఫేర్ డీడీ రామారావు, జిల్లా రిజిస్ట్రార్ ఉపేంద్ర, సర్వే శాఖ ఏడీ, హౌసింగ్ పీడీ, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల సూపరింటెండెంట్లు, తహశీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

కూటమి అభ్యర్థి జురెడ్డి ప్రసాద్‌తో పాటు వార్డు అభ్యర్థులకు మద్దతుగా హోంమంత్రి అనిత ప్రచారం....





పాయకరావుపేట, నవంబర్ 27 మనసులో మాట.

పాయకరావుపేట పట్టణ అభివృద్ధికి తాను పూర్తి బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. పట్టణంలో చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తామని తెలిపారు. ఈ నెల 29న జరగనున్న పంచాయతీ ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి అభ్యర్థి జురెడ్డి ప్రసాద్‌తో పాటు వార్డు అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని ఆమె ప్రజలను కోరారు. పట్టణంలోని పలు వార్డుల్లో హోంమంత్రి అనిత విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడుగడుగునా పట్టణ ప్రజలు ఆమెకు స్వాగతం పలికారు. ప్రజలను ఆప్యాయంగా పలకరిస్తూ కూటమి అభ్యర్థులకు మద్దతుగా కరపత్రాలను పంపిణీ చేశారు. పాయకరావుపేట పట్టణ అభివృద్ధే ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, కూటమి అభ్యర్థులకు మద్దతు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండున్నరేళ్లలో పాయకరావుపేటలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని అనిత తెలిపారు. పట్టణ ప్రధాన రహదారి అభివృద్ధితో పాటు డ్రైనేజీ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని చెప్పారు. సుమారు రూ.18 కోట్లతో పట్టణంలో వివిధ అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు వెల్లడించారు. పాయకరావుపేట పంచాయతీకి నూతన భవన నిర్మాణం కోసం గతంలో రూ.90 లక్షలు మంజూరు చేయించినా, గత ప్రభుత్వ హయాంలో పంచాయతీ భవన నిర్మాణంపై కూడా దృష్టి పెట్టలేదని విమర్శించారు. పట్టణంలో పారిశుద్ధ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, చెత్త నిల్వ ఉండకుండా ఎప్పటికప్పుడు తరలించేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని మంత్రి వివరించారు. అంబేద్కర్ భవనాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామని హామీ ఇచ్చారు. పాయకరావుపేట నియోజకవర్గానికి స్టీల్ ప్లాంట్, బల్క్ డ్రగ్ పార్క్ వంటి పరిశ్రమలు రాకతో, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. ఎన్డీఏ కూటమి అభ్యర్థి జురెడ్డి ప్రసాద్ మంచి నాయకుడని, ఆయనతో పాటు వార్డు అభ్యర్థులకు ప్రజలు మద్దతు తెలిపి గెలిపించాలని హోం మంత్రి అనిత కోరారు. పంచాయతీ బాధ్యతను తాను తీసుకుంటానని, పట్టణాన్ని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని ఆమె స్పష్టం చేశారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన విజయనగరం డిఎస్పీ లక్ష్మణమూర్తి

గంట్యాడ,నవంబర్ 27 (మనసులో మాట):.

గంట్యాడ మండలంలోని పలు గ్రామాలలో పంచాయతీ ఎన్నికల పోలింగ్ కేంద్రాలను శుక్రవారం విజయనగరం డిఎస్పీ లక్ష్మణమూర్తి పరిశీలించారు. నవంబర్ 29వ తేదీన గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో గంట్యాడ మండలంలోని కొండతామరాపల్లి, గింజేరు గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను విజయనగరం డిఎస్పి లక్ష్మణమూర్తి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు, తదితర విషయాల గురించి ఆరా తీశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందికి డిఎస్పి లక్ష్మణమూర్తి పలు సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయనగరం రూరల్ సీఐ లక్ష్మణరావు, గంట్యాడ ఎస్ఐ కే లక్ష్మణరావు పాల్గొన్నారు.



డీజే నిర్వాహకులకు ఏసీపీ లక్ష్మణమూర్తి హెచ్చరిక

- నిబంధనలు ఉల్లంఘిస్తే పరికరాల సీజ్.. రాత్రి 10 తర్వాత శబ్దాలకు నిషేధం

విశాఖపట్నం సిటీ, నవంబర్ 27 (మనసులో మాట) :



వేడుకలు, ఊరేగింపుల పేరుతో అధిక శబ్దాలతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని తూర్పు ఉపవిభాగ ఏసీపీ కె. లక్ష్మణమూర్తి హెచ్చరించారు. శుక్రవారం తన కార్యాలయంలో డీజే నిర్వాహకులతో సమావేశమై ప్రజా భద్రత, శాంతిభద్రతల పరిరక్షణకు పలు సూచనలు చేశారు. డీజే అధిక శబ్దాల కారణంగా ప్రమాదం జరిగినా, మరణం సంభవించినా నిర్వాహకులదే పూర్తి బాధ్యతని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని స్పష్టం చేశారు. పరిమితికి మించి శబ్దం చేస్తున్నట్లు ఫిర్యాదులు అందితే డీజే బాక్సులను సీజ్ చేయడంతోపాటు టౌన్ న్యూసెన్స్ చట్టం, బీఎన్ఎస్, పబ్లిక్ సేఫ్టీ చట్టాల ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ర్యాలీలు, ఊరేగింపుల్లో రోడ్లపై నృత్యాలతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగినా నిర్వాహకులు బాధ్యత వహించాల్సి ఉంటుందని తెలిపారు. సంబంధిత అధికారి అనుమతి లేని కార్యక్రమాల్లో డీజేలు వినియోగించరాదన్నారు. శబ్ద కాలుష్య నియంత్రణ నిబంధనలు 2000 ప్రకారం నివాస ప్రాంతాల్లో పగటిపూట 55, రాత్రిపూట 45 డెసిబుల్స్ పరిమితి మించరాదని సూచించారు. రాత్రి 10 నుంచి ఉదయం 6 గంటల వరకు డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగం నిషేధమని స్పష్టం చేశారు.

14వ వార్డు కార్పొరేటర్ పర్యటన.. ప్రజా సమస్యల పరిష్కారానికి భరోసా

- అప్పర, డ్రైవర్స్ కాలనీల్లో పర్యటన.. ఫ్రైడే డ్రై డేపై అవగాహన

విశాఖపట్నం సిటీ, నవంబరు 27 (మనసులో మాట) :

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యమిస్తూ 14వ వార్డు కార్పొరేటర్ కాకి గంగరాజు క్షేత్రస్థాయిలో పర్యటించారు. విశాఖ తూర్పు నియోజకవర్గ పరిధిలోని అప్పర కాలనీ, డ్రైవర్స్ కాలనీల్లో పర్యటించి స్థానికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వాటి పరిష్కారానికి సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జీవీఎంసీ అధ్వర్యంలో నిర్వహించిన 'ఫ్రైడే డ్రై డే' కార్యక్రమంలో పాల్గొని దోమల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. నీటి ట్యాంకులు, ఖాళీ సీసాలు, మొక్కల కుండీలు, ఫ్రిజ్ వెనుక భాగంలోని ట్రేల్లో నీరు నిల్వ ఉండకుండా వారానికోసారి శుభ్రం చేసుకోవాలని సూచించారు. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెంది మలేరియా, డెంగ్యూ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఉందని వివరించారు. పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని తెలిపారు.
కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు ముగడ రాజారావు, అప్పర కాలనీ అధ్యక్షుడు బోధ లక్ష్మణరావు, లింగబోతు అప్పారావు, ఎస్.కె. కలేశా, కొల్లి ఎర్రాజీరావు, లోడగల రమణ, సీతతో పాటు కాలనీ సంఘ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.



రోగుల భద్రత కోసమే.. విమ్స్ అంతర్గత రహదారిపై ఆంక్షలు.!





- ప్రత్యామ్నాయ మార్గంగా వినియోగించొద్దు.. ప్రజలకు విమ్స్ డైరెక్టర్ విజ్ఞప్తి

విశాఖపట్నం సిటీ, నవంబర్ 27 (మనసులో మాట) :

రోగుల సురక్షిత రాకపోకలకు ప్రాధాన్యమిస్తూ విమ్స్ (VIMS) అంతర్గత రహదారిపై సాధారణ వాహనాల రాకపోకలను నియంత్రిస్తున్నారు. అయితే కొందరు వాహనదారులు ప్రధాన రహదారిపై రద్దీని తప్పించుకునేందుకు ఈ మార్గాన్ని ప్రత్యామ్నాయంగా వినియోగిస్తుండటంతో రోగులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ద్విచక్ర వాహనాలు, ఆటోలు అతివేగంగా రాకపోకలు సాగించడం వల్ల న్యూరో వ్యాధిగ్రస్తులు, నెమ్మదిగా నడిచే రోగులు, వారి సహాయకులకు ప్రమాదాలు పొంచి ఉన్నాయి. డెయిరీఫాం జంక్షన్ నుంచి కొందరు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలకు విరుద్ధంగా విమ్స్ ప్రధాన మార్గంలోకి ప్రవేశించి, రెండో గేటు నుంచి అరిలోవ వైపు వెళ్తున్నారు. రోగుల సౌకర్యార్థం ఈ మార్గంలో ఉచిత బ్యాటరీ కార్లు, అంబులెన్సులు అందుబాటులో ఉంటున్నాయి. రోగులు, వారి సహాయకులు, వైద్య సిబ్బంది వాహనాలకు ఇబ్బంది కలగకుండా ప్రతి గేటు వద్ద భద్రతా సిబ్బందిని నియమించి రాకపోకలను పర్యవేక్షిస్తున్నారు. ఆసుపత్రితో సంబంధం లేని సాధారణ వాహనదారులు ఈ రహదారిని వినియోగించరాదని, రోగుల భద్రత కోసం చేపడుతున్న ట్రాఫిక్ నియంత్రణ చర్యల

రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు బయలుదేరిన జిల్లా జట్టు


టెక్కలి, నవంబర్ 27 (మనసులో మాట) :



రాష్ట్ర స్థాయి రగ్బీ పోటీలకు శ్రీకాకుళం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్ 15 విభాగంలో సబ్ జూనియర్స్ బాలబాలికల జట్టు శుక్రవారం టెక్కలి రైల్వే స్టేషన్ నుండి బయలుదేరింది. కర్నూలు జిల్లా కర్నూలు స్టేడియంలో ఈనెల 29 నుండి 30. రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ అండర్ 15 రగ్బీ ఛాంపియన్షిప్ పోటీలు జరుగనున్నాయి. శ్రీకాకుళం జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షులు డొంకన రామకృష్ణ, ప్రధాన కార్యదర్శి పొన్నాడ పారితీశం క్రీడాకారులకు ఉద్దేశించి అధ్యక్షులు రామకృష్ణ విజయంతో రావాలని ఆకాంక్షించారు. క్రీడాకారులకు దుస్తులు,రవాణా సౌకర్యాలు అధ్యక్షులు రామకృష్ణ కల్పించారు.జిల్లా రగ్బీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాడాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.కె. రామిరెడ్డి, కె .రఘునాథరావు, ఎస్. లక్ష్మణరావు, ఎన్.. నాగరాజు, సుందర్రావు,శైలజ,సీతయ్య,నర్మదా, టీమ్ కి అభినందనలు తెలిపారు.

భీమబోయినపాలెం పంచాయతీలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవ ఎన్నిక

మాకవరపాలెం, నవంబర్ 27 (మనసులో మాట):



అనకాపల్లి జిల్లా మాకవరపాలెం మండలం భీమబోయినపాలెం గ్రామ పంచాయతీలో సర్పంచ్ అభ్యర్థితో పాటు వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల అధికారులు అధికారికంగా ప్రకటించారు. టీడీపీ మాజీ సర్పంచ్ రుత్తుల నందకిషోర్ ఆధ్వర్యంలో జరిగిన కృషి, నాయకత్వంతో గ్రామంలో ఏకాభిప్రాయం ఏర్పడి సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యుల ఎన్నిక ఏకగ్రీవంగా సాగడం పట్ల టీడీపీ శ్రేణులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.
ఈ సందర్భంగా ఏకగ్రీవంగా ఎన్నికైన సర్పంచ్ అభ్యర్థికి, వార్డు సభ్యులందరికీ హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. గ్రామ అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకొని, గ్రామాన్ని అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్లాలని గ్రామ ప్రజలు ఆకాంక్షిస్తున్నారు. ఏకగ్రీవ ఎన్నికతో భీమబోయినపాలెం గ్రామంలో నూతన అభివృద్ధి పథానికి నాంది పలకాలని ఆశిద్దాం.

ప్రజల విశ్వాసం కోల్పోయిన బాబు సర్కార్!

- స్థానిక ఎన్నికల్లో అక్రమాలు, హింసతోనే గెలవాలని చూశారు
- చంద్రబాబుపై మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు తీవ్ర విమర్శలు

శ్రీకాకుళం, నవంబర్ 27 (మనసులో మాట):



చంద్రబాబు ప్రభుత్వం ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, స్థానిక సంస్థల ఎన్నికల్లో చోటుచేసుకున్న పరిణామాలే అందుకు నిదర్శనమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు విమర్శించారు. రెండున్నరేళ్ల పాలనపై ప్రజల్లో నమ్మకం లేకపోవడంతోనే అధికార దుర్వినియోగం, బెదిరింపులు, హింసను ఆశ్రయించి ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నించారని ఆరోపించారు. శుక్రవారం శ్రీకాకుళంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన కూటమి ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార పార్టీకి అనుకూలంగా వార్డుల విభజన చేపట్టి, ఓటర్ల జాబితాలో అక్రమాలకు పాల్పడ్డారని ధర్మాన ఆరోపించారు. ఒకే కుటుంబానికి చెందిన ఆరు ఓట్లను ఆరు వేర్వేరు డివిజన్లలోకి మార్చడం, తప్పుడు లెక్కలతో రిజర్వేషన్లను తమకు అనుకూలంగా మార్చుకోవడం వంటి చర్యలతో ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని మండిపడ్డారు. బలమైన ప్రతిపక్ష అభ్యర్థులను పోటీ నుంచి తప్పించేందుకు వారి వ్యాపారాలు, వృత్తులను దెబ్బతీస్తామంటూ బెదిరించారని, నామినేషన్లు వేసిన అభ్యర్థులపై దాడులకు దిగారని ఆరోపించారు. కొన్ని ప్రాంతాల్లో అభ్యర్థుల అనుమతి లేకుండానే రిటర్నింగ్ అధికారులు నామినేషన్లను ఉపసంహరించుకున్నట్లు నమోదు చేశారని పేర్కొన్నారు. పోలింగ్ రోజున ఎన్నికల నియమావళి ప్రకారం నియామక పత్రాలు కలిగిన ఏజెంట్లను సైతం పోలీసులు స్టేషన్లలో నిర్బంధించారని ధర్మాన ఆరోపించారు. పోలీస్‌స్టేషన్ల వద్ద ప్రతిపక్ష కార్యకర్తలు లేకుండా చేసి, అధికార పార్టీకి చెందినవారు దౌర్జన్యాలకు పాల్పడేందుకు అవకాశం కల్పించారని విమర్శించారు. ఎన్నికల సందర్భంగా చోటుచేసుకున్న హింస, మరణాలకు ముఖ్యమంత్రి చంద్రబాబే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. ఈ పరిణామాలపై జాతీయ మీడియా కూడా స్పందించిందని అన్నారు. శ్రీకాకుళంలో పోలింగ్ సందర్భంగా తనను అక్రమంగా గృహ నిర్బంధం చేయడంపై ధర్మాన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. జనరల్ ఏజెంట్‌గా వెళ్లాలనుకున్న తనను ఏ నిబంధనల ప్రకారం నిర్బంధించారని ప్రశ్నించారు. హౌస్ అరెస్ట్‌కు సంబంధించి ఏ అధికారి అయినా లిఖితపూర్వక ఆదేశాలు ఇవ్వగలరా అని నిలదీశారు. రాజ్యాంగ పరిరక్షణ దినం రోజునే తనను నిర్బంధించడం రాజ్యాంగ విరుద్ధ చర్యగా అభివర్ణించారు. ఎన్నికల నిబంధనలను తాను ఉల్లంఘించలేదని, అధికారులే నిబంధనలను తుంగలో తొక్కారని ఆరోపించారు. ఓట్ల లెక్కింపు సమయంలోనూ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయని ధర్మాన ఆరోపించారు. ప్రతిపక్ష అభ్యర్థులు గెలిచిన ప్రాంతాల్లో కౌంటింగ్ హాళ్లలో లైట్లు ఆర్పివేయడం, ఓట్ల కట్టలను కలిపేయడం, రీకౌంటింగ్ పేరుతో ఓడిపోయిన అధికార పార్టీ అభ్యర్థులకు విజయ ధ్రువీకరణ పత్రాలు అందజేయడం వంటి చర్యలకు పాల్పడుతున్నారని అన్నారు. చిన్నపాటి ఘర్షణలను సాకుగా చూపి కౌంటింగ్ కేంద్రాల్లోకి పోలీసులు ప్రవేశించి ప్రతిపక్ష ఏజెంట్లను బయటకు పంపిస్తున్నారని విమర్శించారు. కౌంటింగ్ ప్రక్రియను న్యాయవాదులు, జాతీయ మీడియా ప్రతినిధుల సమక్షంలో నిశితంగా పరిశీలిస్తామని స్పష్టం చేశారు. అక్రమాలకు పాల్పడుతున్న అధికారులపై ప్రైవేటు కేసులు దాఖలు చేస్తామని హెచ్చరించారు. అక్రమ కేసులతో ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను సైతం ఒత్తిడికి గురిచేస్తున్నారని ఆరోపించారు. అధికారంలో ఉన్నవారికి పదవులు శాశ్వతం కావని, 2029 తర్వాత వారంతా ప్రతిపక్షంలో కూర్చోవాల్సి వస్తుందని వ్యాఖ్యానించారు. అసెంబ్లీలో వైఎస్సార్‌సీపీకి ఉన్న సీట్ల సంఖ్యను చూసి తమ పార్టీ బలాన్ని అంచనా వేయవద్దని ధర్మాన అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ 40 శాతం ఓట్లు సాధించిందని గుర్తుచేశారు. వైఎస్ జగన్ ఐదేళ్ల పాలనలో ప్రజలను హింసించే చర్యలకు పాల్పడలేదని పేర్కొన్నారు. గతంలో పోటీ చేయని స్థానిక ఎన్నికల్లోనూ వైఎస్సార్‌సీపీ అక్రమాలకు పాల్పడిందంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి ప్రజాస్వామ్య హక్కులను హరించడం చంద్రబాబు చెప్పుకునే రాజకీయ అనుభవమా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో జరుగుతున్న పరిణామాలు 2029లో కూటమి ఓటమికి పునాది వేస్తాయని ధర్మాన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య వ్యవస్థను, ఎన్నికల నిబంధనలను గౌరవించాలని ప్రభుత్వానికి హితవు పలికారు.

సర్పంచ్ అంటే పదవి కాదు.. ప్రజలను సేవచేసే బాధ్యత' కేరంగి గంగమ్మ, ధర్మన్న దంపతులు







అనంతగిరి నవంబర్ 27 మనసులో మాట

గ్రామ పంచాయతీ సర్పంచ్ అంటే కేవలం ఒక పదవి కాదని, అది గ్రామ ప్రజల కష్ట సుఖాలను దగ్గరుండి చూసుకునే ఒక గొప్ప బాధ్యతని అనంతగిరి మండలం వాలాసి గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థి కేరంగి గంగమ్మ, ధర్మన్న దంపతులు పేర్కొన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా పంచాయితీలో పర్యటించిన ఈ దంపతులకు స్థానిక నాయకులు, ఓటర్ల నుండి అపూర్వ ఆదరణ లభించింది. ఇంటింటికీ తిరిగి ప్రచారం నిర్వహిస్తున్న గంగమ్మ దంపతులకు గ్రామస్తులు మంగళహారతులతో నీరాజనాలు పడుతూ ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేరంగి గంగమ్మ, ధర్మన్న దంపతులు మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధే తమ ఏకైక లక్ష్యమని స్పష్టం చేశారు. ప్రజలు తమపై నమ్మకంతో ఒక్క అవకాశం ఇస్తే, వాలసి పంచాయతీ అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిస్తామని భరోసా ఇచ్చారు.

మౌలిక సదుపాయాలు సంక్షేమ పథకాలు

పంచాయతీలోని ప్రతి వీధిలో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, నిరంతర తాగునీటి సరఫరా మరియు వీధి దీపాల సమస్యలను శాశ్వతంగా పరిష్కరిస్తామని తెలిపారు.
అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా అందేలా నిరంతరం అందుబాటులో ఉంటామని హామీ ఇచ్చారు.

నాయకుల మద్దతు

గంగమ్మ దంపతుల సేవా దృక్పథం, ప్రజలతో వారికి ఉన్న సన్నిహిత సంబంధాల దృష్ట్యా గ్రామంలోని పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

గెలుపు ఖాయమంటున్న ఓటర్లు

కష్టకాలంలో అండగా నిలిచే కేరంగి గంగమ్మ, ధర్మన్న దంపతులను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామని ఓటర్లు ముక్తకంఠంతో చెబుతున్నారు. మహిళలు, యువత స్వచ్ఛందంగా ప్రచారంలో పాల్గొంటూ ఆమె విజయానికి కృషి చేస్తున్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, మహిళా యువకులు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞ : సీడీపీఓ విమల

- బాల్యవివాహ రహిత భారత్ నిర్మాణమే లక్ష్యం

మాడుగుల, నవంబర్ 27 (మనసులో మాట):



బాల్యవివాహాలను సమాజం నుంచి పూర్తిగా నిర్మూలించి, బాల్యవివాహ రహిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని సీడీపీఓ విమల పిలుపునిచ్చారు. బాల్యవివాహ రహిత భారత్ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మాడుగులజిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బాల్యవివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలు, బాలల హక్కులు, బాలల సంరక్షణ, చైల్డ్ హెల్ప్‌లైన్ సేవలపై అధికారులు అవగాహన కల్పించారు. బాల్యవివాహాలు బాలల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టడంతోపాటు వారి విద్య, ఆరోగ్యం, వ్యక్తిగత ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతాయని వివరించారు. బాల్యవివాహాలను ప్రోత్సహించకుండా, ఎక్కడైనా అలాంటి ఘటనలు చోటుచేసుకుంటే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని, బాల్యవివాహాలకు దూరంగా ఉండాలని విద్యార్థులు, ఉపాధ్యాయులతో ప్రతిజ్ఞ చేయించారు. బాలల హక్కులను కాపాడుతూ, ప్రతి చిన్నారికి విద్య, భద్రతతో కూడిన భవిష్యత్తును అందించడమే బాల్యవివాహ రహిత భారత్ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ విమల, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు వి. ఈశ్వరమ్మ, కె. హసీనా బేగం, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

తప్పుడు సంకేతాలు ఇస్తూ నన్ను బరిలో దించారని ఆవేదన చెందుతున్న కోష్ట ఎంపీటీసీ

రణస్థలం, నవంబర్ 27. (మనసులో మాట)



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి, ఎమ్మెల్యేగా గెలిచినప్పటి నుంచి ఎంపీపీ పదవి మీదే అని చెప్పడం వాస్తవం కాదా. టీడీపీ ఇన్‌చార్జిగా లంక శ్యామలరావు నియమితులైనప్పటి నుంచి కూడా ఎంపీపీ పదవి మీకే అని హామీ ఇచ్చింది వాస్తవం కాదా?

మొదట ఎంపీపీ పదవి మీకే అని చెప్పి, ఆ తర్వాత మరో వ్యక్తిని తీసుకొచ్చి రెండున్నరేళ్లు మీకు, రెండున్నరేళ్లు ప్రభాకర్‌కు కేటాయించాలని ప్రతిపాదించింది వాస్తవం కాదా?

ఆ తర్వాత ఆ రెండున్నరేళ్ల కాలాన్ని రెండేళ్లు, రెండేళ్లు, ఒక ఏడాది చొప్పున ముగ్గురికి పంచాలని నిర్ణయించడం వాస్తవం కాదా?

పోనీ, రాజకీయ అనుభవం, పార్టీకి నేను చేసిన సేవలను పరిగణనలోకి తీసుకొని కనీసం మొదటి రెండున్నరేళ్ల అవకాశం నాకివ్వాలని కోరడం తప్పా?

మీరు ఇచ్చిన మాటను నమ్మి నేను ఎంపీటీసీ ఎన్నికల బరిలోకి దిగాను. ఎంపీటీసీ అభ్యర్థుల విజయానికి ఆర్థికంగా సహకరించడంతో పాటు, వారి గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశాను. పార్టీ గెలుపు కోసం ఇంత చేసిన నేను, నా రాజకీయ అనుభవాన్ని దృష్టిలో ఉంచుకొని మొదటి విడతగా ఎంపీపీ పదవి ఇవ్వాలని అడగడం తప్పెలా అవుతుంది?

నేను అడిగిన ప్రతిసారీ అధిష్టానం దగ్గర తేల్చుకోండని నన్ను పంపించడం వాస్తవం కాదా?

అధిష్టానంలోని పెద్దలు మీకు ఫోన్ చేసి, జగన్నాథం నాయుడికి ముందుగా అవకాశం ఇవ్వాలని సూచించడం వాస్తవం కాదా?

అది కూడా కుదరని పరిస్థితిలో కనీసం లాటరీ పద్ధతిలో ఎంపిక చేద్దామని పార్టీ పెద్దలు సూచించినప్పుడు, ఆ ప్రతిపాదనకు కూడా ఇంచార్జి అంగీకరించకపోవడం వాస్తవం కాదా?

అర్ధరాత్రి సమయంలో ఎంపీపీ పదవిని బీజేపీకి కేటాయించారని చెప్పినప్పుడు, పార్టీ పెద్దల నిర్ణయాన్ని దృష్టిలో పెట్టుకొని దానికి కూడా మేము అంగీకరించడం వాస్తవం కాదా?

అసెంబ్లీ ఎన్నికల సమయంలో కోష్ట పంచాయతీలో మీ విజయానికి నా కుటుంబంతో పాటు గ్రామ ప్రజలంతా ఎంతో కష్టపడ్డారు. మీకు అండగా నిలిచి, 650కి పైగా ఓట్ల మెజారిటీతో మిమ్మల్ని గెలిపించిన ప్రజలు మీ ముందుకు వచ్చినప్పుడు.. "మీరు వస్తే మా కార్లు ఎక్కించాం, కూర్చోవడానికి కుర్చీలు వేశాం" అంటూ వారిని అవమానించేలా మాట్లాడటం వాస్తవం కాదా?

ఆ రోజు మీ విజయానికి కష్టపడిన ప్రజలు ఈరోజు మీ ఇంటికి కుర్చీలు అడగడానికి వచ్చారా?

మరోవైపు, మాకు ఎలాంటి పదవులు అవసరం లేదని, ఎంపీపీ ఎన్నికలను బహిష్కరిస్తామని చెప్పిన మీరు, ఎన్నికల సమయానికి మీ స్కూల్ నుంచి హుటాహుటిన బయలుదేరి రావడం వాస్తవం కాదా?

మాటకు, చేతకు మధ్య ఇంత వ్యత్యాసం ఎందుకు?

ఎంపీటీసీల గెలుపు కోసం ఆర్థికంగా మేము సహకరిస్తే, 13 మంది ఎంపీటీసీలను రెండు రోజుల పాటు మీ స్కూల్‌లో ఉంచి, ఎన్నికలే వద్దని బయటకు చెప్పి, ఒక్కసారిగా మీరంతా అక్కడి నుంచి బయలుదేరడం వెనుక ఉన్న అసలు ఉద్దేశం ఏమిటి?

కోష్ట పంచాయతీ నాలుగు గ్రామాల ప్రజలే కాకుండా, మమ్మల్ని అభిమానించే ఎంతోమంది మీ దగ్గరకు వచ్చినప్పుడు, కనీసం వారు ఎందుకు వచ్చారు? ఏం చెప్పాలనుకుంటున్నారు? అని అడిగి వారి మాట వినే ప్రయత్నం కూడా చేయకుండా, వారిని అవమానించడం ఎంత వరకు సమన్యాయం.

ఎన్నికల సమయంలో కూడా మాకు పదుతున్నటువంటి ఒక ఓటును మీరు భయపెట్టి ఎత్తిన చేయిని దింపించడం వాస్తవం కాదా?

సరే, చివరకు ఎంపీపీ పదవి టీడీపీకే ఇవ్వాలని నిర్ణయించినప్పుడు పార్టీ అధిష్టానం తుది నిర్ణయం కోసం మేము సంయమనంతో ఎదురుచూస్తుంటే, సరస్వతి నిలయం వంటి మీ పాఠశాలలో ఎంపీటీసీ సభ్యులను రెండు రోజులపాటు ఉంచి రాజకీయ మంతనాలు జరపడం ఎంతవరకు సమంజసం? అసలు అలా జరగలేదని మీరు చెప్పగలరా?

ఒక ఫొటోను పట్టుకొని, అది కూడా అనుకోకుండా జరిగిన ఒక సందర్భాన్ని ఆధారంగా చేసుకొని నాపై, నన్ను నమ్ముకున్న వారిపై విమర్శలు చేయడం ఎంతవరకు న్యాయం? ఎవరు ఏ పార్టీల నుంచి వచ్చారు? ఎవరెవరితో మీకు ఫొటోలు ఉన్నాయి? ఇప్పటికీ ఎవరెవరితో రాజకీయ సంబంధాలు కొనసాగిస్తున్నారు? అవసరమైతే అన్నింటినీ తగిన ఆధారాలతో ప్రజల ముందు ఉంచమంటారా?

రాజకీయాల్లో ఆరోపణలు చేయడం సులభం.. కానీ ఆధారాలతో సమాధానం చెప్పడం ముఖ్యం.

నేను పార్టీకి వ్యతిరేకంగా ఎప్పుడూ పనిచేయలేదు. పార్టీ నిర్ణయాలను గౌరవించాను. ఎన్నో అవమానాలు ఎదురైనా పార్టీ కోసం నిలబడ్డాను. అయినా నాపై బురదజల్లే ప్రయత్నం చేయడం బాధాకరం.

పోటీ పడే వారితో రాజకీయంగా తలపడవచ్చు. కానీ నమ్మించి మోసం చేసే వారితో ఎలా పోరాడగలం? నమ్మకాన్ని వమ్ము చేసి, ఆ తర్వాత తప్పును ఎదుటివారిపై నెట్టడం ఏ రాజకీయ నీతి?

నా ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా నాపై వ్యక్తిగత విమర్శలు చేయడం మానుకోవాలి. వాస్తవాలను ప్రజల ముందు ఉంచే ధైర్యం ఉంటే, ప్రతి అంశానికీ సమాధానం చెప్పండి.

పైన నేను చెప్పిన ప్రతి అంశం నిజమని శ్రీరాముడి సాక్షిగా ప్రమాణం చేసి చెబుతున్నాను. మీరు ఎక్కడికి రమ్మన్నా, ఏ దేవుని మీద ప్రమాణం చేయమన్నా, నా పిల్లలతో వచ్చి ప్రమాణం చేస్తాను. నేను చెప్పిన విషయాలన్నీ అబద్ధాలని, మీరు చెబుతున్నవే నిజాలని అదే శ్రీరాముడి సాక్షిగా మీరు ప్రమాణం చేస్తారా? నేను పదవి కోసం పార్టీని నమ్ముకోలేదు.. పార్టీని నమ్ముకొని పదవి కోసం పోరాడాను. ఈ రెండింటి మధ్య ఉన్న తేడాను గుర్తించాలి!

పాటిపల్లి పంచాయతీలు మోల్లేటి భోగేశ్వర రావుకు అడుగడుగునా జనం నీరాజనం





- ఉపాధి కూలీల ఆశీర్వాదాన్ని తీసుకుంటున్న భోగేష్

మునగపాక, నవంబర్ 27, మనసులో మాట

మండలంలో ఎంతో ప్రసిద్ధి చెందిన పాటిపల్లి పంచాయితీలు జనసేన పార్టీ మద్దతుదారునిగా పోటీ చేస్తున్న సామాజిక కార్యకర్త మొల్లేటి భోగేశ్వర రావు కు ప్రజలు అడుగడుగునా జనం నీరాజనం పడుతున్నారు. ప్రచారానికి ఒక రోజే ఉండడంతో గ్రామంలోని మంగళవారం పేట, కాలనీలో విస్తృతంగా పర్యటిస్తున్నాడు. ఉపాధి పనులు చేస్తున్న ఉపాధి కూలీల దగ్గరికి వెళ్లి తనకు ఓటేసి గెలిపిస్తే మీ కష్టాల్లోనూ సుఖాల్లోనూ పాలుపంచుకుంటానని భరోసా పలుకుతున్నారు. గతంలోనే బోగేష్ స్వచ్ఛందంగా ఉపాధి కూలీలకు భోజనాలు ఏర్పాటు చేయడం, మజ్జిగ కూల్ డ్రింక్స్ బిస్కెట్స్ వంటివి పంపిణీ చేయడం జరగడం వల్ల ఉపాధి కూలీలు ఎంత తప్పకుండా మీకు ఓటేసి గెలిపిస్తామని హామీ ఇస్తున్నట్లు భోగి తెలిపారు. భోగిస్ వెనుక సైన్యం లాంటి జనసేన యువనాయకులు గట్టిగా పని చేయడంతో గెలుపు తనదే నంటూ బోగేస్ దేమ వ్యక్తం చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీకి ఫైర్ బాండ్ గా నిలుస్తున్న ఆడారి జానకిని గెలిపించండి అభివృద్ధి చేసి చూపిస్తా

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజవర్గం టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు

మునగపాక, నవంబర్ 27, మనసులో మాట



తెలుగుదేశం పార్టీలో ఎంతో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ పార్టీకి అంకితభావంతో పనిచేస్తున్న ఆడారి జానకిని అత్యధిక మెజార్టీతో ప్రజలంతా ఆశీర్వదించాలని రాష్ట్ర రోడ్లు అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం పంచాయతీలు ప్రజల చెంతకు వెళ్లి ఆడారి జానకిని అత్యధిక మెజార్టీతో ఓట్లు వేసి గెలిపించాలని ప్రజలకు నాగేశ్వరావు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు గుర్తించి జానకికి ఓట్లు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో విశాఖపట్నం కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం డైరెక్టర్ కడియం అనురాధ, ఎలమంచిలి మార్కెట్ కమిటీ డైరెక్టర్ రేపాక మాలతి, టిడిపి సీనియర్ నాయకుడు మల్ల నాయుడు పలువురు పాల్గొన్నారు.

నడిమివలస పంచాయతీ బాలి శ్రీదేవి జోరుగా ఇంటింటి ప్రచారం

రాజాం , నవంబర్ 27. (మనసులో మాట)



సర్పంచ్ అభ్యర్థి బాలి. శ్రీదేవి నడిమివలస పంచాయతీ, గ్రామంలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా మంగళ హారతి ఇస్తూ ఆ గ్రామ ప్రజలు స్వాగతం పలుకుతున్నారు. గ్రామ ప్రజలు ఆశీర్వాదాలు కోరారు. ఈ ప్రచార కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. శ్రీదేవి ఏ ఇంటి వెళ్లిన మంగళహారతో స్వాగతం పలుకుతూ ఆప్యాయతగా చూస్తున్నారని ఆనంద వ్యక్తం చేశారు. నడిమువలస పంచాయతీ ప్రజలారా మీ అమూల్యమైన ఓటును ఉంగరం గుర్తుపై వేసి, బాలి శ్రీదేవి ని అఖండ మెజారిటీతో గెలిపించాలని మనస్ఫూర్తిగా కోరుతున్నారు .

జెడ్పీ చైర్‌పర్సన్ సిరి సహస్రకు అభినందనల వెల్లువ





- పుష్పగుచ్ఛాలు అందించి, దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించిన వివిధ రంగాల ప్రతినిధులు

విజయనగరం, నవంబర్ 27 (మనసులో మాట):

విజయనగరం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ మజ్జి సిరి సహస్ర (సిరమ్మ)కు అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఆమె నూతన బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ప్రజా ప్రతినిధులు, రాజకీయ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు. ఈ క్రమంలో శుక్రవారం విజయనగరం ధర్మపురిలోని సిరి సహస్ర క్యాంపు కార్యాలయం (సిరి సహస్ర రైజింగ్ ప్యాలెస్)లో ఆమెను, ఆమె భర్త ప్రదీప్ నాయుడును పలువురు ప్రముఖులు కలిసి అభినందించారు. తెలుగుదేశం పార్టీ అరకు పార్లమెంటరీ పరిశీలకులు, ఉమ్మడి విజయనగరం జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె అయిన సిరి సహస్రకు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం ప్రతినిధులు, ఐసీఐసీఐ బ్యాంకు మేనేజర్, కార్యాలయ సిబ్బంది, విజయనగరం 20వ డివిజన్ కార్పొరేటర్ పిలక దేవి, మైనార్టీ నాయకులు మునీర్, వెంకట్ రెడ్డితో పాటు పలువురు ముఖ్య నాయకులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిరి సహస్ర, ప్రదీప్ నాయుడును దుశ్శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి అభినందనలు తెలియజేశారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న సిరి సహస్రకు వివిధ వర్గాల నుంచి అభినందనలు అందుతుండటంతో ఆమె క్యాంపు కార్యాలయంలో సందడి నెలకొంది. పలువురు ప్రముఖుల రాకతో ఆత్మీయ వాతావరణం కనిపించింది.

గణబాబు తనయుడు మౌర్య సింహ జన్మదిన వేడుకలు

- రాష్ట్ర నాయకుడు రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో.....

మల్కాపురం ప్రతినిధి: నవంబర్ 27: (మనసులో మాట)

విశాఖపట్నం పశ్చిమ నియోజక వర్గ శాసనసభ్యులు, రాష్ట్ర ప్రభుత్వ విప్, గణబాబు తనయుడు మౌర్యసింహ జన్మదిన వేడుకలు శుక్రవారం పారిశ్రామిక ప్రాంతం అభయ ఆంజనేయ స్వామి ఆలయంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ యువ నాయకుడు, రాష్ట్ర అధికార ప్రతినిధి, సిహెచ్ రామ్మోహన్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది.



ముందుగా ఆంజనేయస్వామి దేవాలయంలో మౌర్య సింహ పేరున ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మౌర్య సింహకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన అనంతరం రామ్మోహన్ నాయుడు మాట్లాడుతూ నిరంతరం ప్రజల మధ్య ఉంటూ, ప్రజాసేవకే అంకితమైన తన తండ్రి గణబాబు అడుగుజాడల్లో మౌర్య సింహ నడుస్తున్నారని రామ్మోహన్ నాయుడు కొనియాడారు. తండ్రి ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ, యువతకు ఆదర్శంగా నిలుస్తూ రాజకీయాల్లో, ప్రజాసేవలో మరింత ఉన్నత శిఖరాలను అధిరోహించాలని భగవంతుడిని ప్రార్థించారు.అనంతరం రామ్మోహన్ నాయుడు , యువ నాయకుడు మౌర్య సింహ నిపూలమాలతో ఘనంగా సత్కరించి, పుష్పగుచ్ఛం అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఆయన నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలో పలువురు స్థానిక నాయకులు, ములగాడ మండల ప్రధాన కార్యదర్శి మల్లా రవి, టిఎన్ఎస్ఎఫ్ అసెంబ్లీ నిర్వాహక కార్యదర్శి మొల్లి గోవర్ధన్, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు శంకర్,కార్యకర్తలు, అభిమానులు, పాల్గొని యువ నాయకుడు మౌర్య సింహకు శుభాకాంక్షలు తెలియజేశారు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంతం

- జిల్లా ఎన్నికల అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- శ్రీకాకుళం నగరపాలక సంస్థలో 54.7 శాతం పోలింగ్ నమోదు
- ఆమదాలవలస మున్సిపాలిటీలో 75.2 శాతం ఓటింగ్

శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి , నవంబర్ 27: (మనసులో మాట)



జిల్లాలో గురువారం జరిగిన పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల పోలింగ్ ప్రక్రియ అత్యంత ప్రశాంతంగా ముగిసిందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి స్వప్నిల్ దినకర్ పుండ్కర్ వెల్లడించారు. సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసిన అనంతరం నమోదైన తుది ఓట్ల వివరాలను ఆయన అధికారికంగా ప్రకటించారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ, ఆమదాలవలస మున్సిపాలిటీలలో మహిళా ఓటర్లు తమ చైతన్యాన్ని చాటుతూ పురుషుల కంటే అధిక శాతంలో ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు.

శ్రీకాకుళం నగరపాలక సంస్థ పరిధిలోని 180 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 1,57,545 మంది ఓటర్లు (పురుషులు: 77,535, మహిళలు: 79,985, ఇతరులు: 25) ఉండగా, సాయంత్రం 5 గంటలకు పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 86,129 మంది (54.7 శాతం) తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 44,281 మంది (55.4 శాతం) ఓటేయగా, పురుష ఓటర్లు 41,848 మంది (54 శాతం) ఓటు వేశారు.

ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని 44 పోలింగ్ కేంద్రాలలో మొత్తం 33,067 మంది ఓటర్లు (పురుషులు: 16,048, మహిళలు: 17,008, ఇతరులు: 11) ఉండగా, పోలింగ్ ముగిసే సమయానికి మొత్తం 24,867 మంది (75.2 శాతం) ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఇందులో మహిళా ఓటర్లు 12,951 మంది (76.1 శాతం), పురుష ఓటర్లు 11,913 మంది (74.2 శాతం), ఇతరులు ముగ్గురు ఓటేశారు. ఎన్నికల ప్రక్రియ విజయవంతంగా, శాంతియుతంగా నిర్వహించేందుకు సహకరించిన ఓటర్లకు, అభ్యర్థులకు, ఎన్నికల సిబ్బందికి, పోలీసు యంత్రాంగానికి జిల్లా ఎన్నికల అధికారి కృతజ్ఞతలు తెలిపారు. ఈనెల 30వ తేదీన కౌంటింగ్ ప్రక్రియ ఉంటుందని కలెక్టర్ పేర్కొన్నారు.

వెంకటలక్ష్మికి మద్దతుగా బొత్స ఝాన్సీ లక్ష్మి ప్రచారం

- వంకాయ గుర్తుపై ఓటేసి అత్యధిక మెజార్టీతో గెలిపించండి..
- గ్రామాభివృద్ధికి సహకరించండి

భీమసింగి, నవంబర్ 27 (మనసులో మాట):





విజయనగరం జిల్లా జామి మండలం భీమసింగి గ్రామంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మద్దతుతో సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న వెంకటలక్ష్మికి మద్దతుగా మాజీ ఎంపీ డాక్టర్ బొత్స ఝాన్సీ లక్ష్మి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా వెంకటలక్ష్మి వంకాయ గుర్తుపై ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆమె గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఎంపీటీసీ శివకుమార్, మాజీ ఎంపీటీసీ రమణబాబుతో కలిసి బొత్స ఝాన్సీ లక్ష్మి తెలగపాలెం, పీతలపాలెం గ్రామాల్లో ఇంటింటికీవెళ్లి ఓటర్లను కలిశారు. వెంకటలక్ష్మికి మద్దతు తెలిపి, ఆమెను సర్పంచ్‌గా గెలిపించాలని కోరారు. గ్రామ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం సరైన నాయకత్వాన్ని ఎన్నుకోవాల్సిన బాధ్యత ప్రతి ఓటరుపై ఉందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. వెంకటలక్ష్మికి అండగా నిలిచి వంకాయ గుర్తుపై ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని గ్రామ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అభ్యర్థి విజయానికి కృషి చేశారు.

అరకులోయలో ఘనంగాఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

- సామాన్య ప్రజల హక్కుల సాధన,అవినీతి వ్యతిరేకపోరాటం,పారదర్శక పాలనే ఆమ్ ఆద్మీ పార్టీ ప్రధాన లక్ష్యాలు
- పార్టీ నాయకురాలు సుజాత సల్మాన్

అరకులోయ, నవంబర్ 27 (మనసులో మాట):



ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్నిపురస్కరించుకుని గురువారం అరకు లోయ మండలంరవ్వలగూడ గ్రామంలో పార్టీ నాయకురాలు, సామాజిక కార్యకర్త సుజాత సల్మాన్ ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ఈ సందర్భంగా సుజాత సల్మాన్ మాట్లాడుతూ 2012 నవంబర్ 26న ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భవించిందని, సామాన్య ప్రజలకు రాజకీయాల్లోభాగస్వామ్యం కల్పించడం, అవినీతికి వ్యతిరేకంగా పోరాడటం, పారదర్శక పాలన అందించడం పార్టీ ప్రధాన ఆశయాలని తెలిపారు. భారత దేశ రాజధాని ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ ప్రభుత్వం విద్యారంగంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, వైద్యరంగంలో మొహల్లా క్లినిక్‌లు, విద్యుత్ మరియు తాగునీటి రాయితీలు, మహిళల సంక్షేమం వంటి అంశాల్లో చేపట్టిన కార్యక్రమాలను ఆమె వివరించారు. రాజకీయాలు అంటే కేవలం అధికారం కోసం పోటీ పడటం మాత్రమే కాదని, ప్రజల సమస్యలపై ప్రశ్నించడం, ప్రజలకు జవాబుదారీగా ఉండటం అని ఆమె పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్‌లో ముఖ్యంగా ఏజెన్సీ ప్రాంతాలైన అరకు వ్యాలీ పరిసర గిరిజన గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, ఉపాధి అవకాశాలు, గిరిజన హక్కుల పరిరక్షణ వంటి మౌలిక సమస్యల పరిష్కారం కోసం ఆమ్ ఆద్మీపార్టీప్రజలగొంతుకగా నిలుస్తుందని తెలిపారు. ప్రజాస్వామ్య విలువలను కాపాడుతూ, సామాన్య ప్రజల హక్కుల సాధన, సమాజ అభివృద్ధి కోసం ఆమ్ ఆద్మీ పార్టీనిరంతరం కృషి చేస్తుందని సుజాత సల్మాన్ పేర్కొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

నర్సీపట్నంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ భవనానికి శంకుస్థాపన

- రూ. 4 కోట్లతో నిర్మాణం, యువతకు నైపుణ్య శిక్షణతో ఉపాధి అవకాశాలు

నర్సీపట్నం: నవంబర్ 27 (మనసులో మాట)





బైపిరెడ్డిపాలెం ఐటీఐ కళాశాల సమీపంలో నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (ఎన్ఏసీ) భవన నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన జరిగింది. అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, ఆయన సతీమణి మున్సిపల్ చైర్‌పర్సన్ పద్మావతి కొబ్బరికాయ కొట్టి శిలాఫలకాన్ని ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఎకరం విస్తీర్ణంలో రూ. 4 కోట్ల వ్యయంతో గ్రౌండ్ ప్లోర్ మరియు మొదటి అంతస్తు నిర్మిస్తామని తెలిపారు. నర్సీపట్నం నియోజకవర్గంలో సుమారు 2 వేల మంది మేస్త్రీలు ఉన్నారని, నిర్మాణ రంగంపై సుమారు 20 వేల కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ భవనం పూర్తయ్యాక తాపీ పని, ప్లంబింగ్, ఎలక్ట్రికల్, ల్యాండ్ సర్వేయర్, బార్ బెండింగ్, స్టీల్ ఫిక్సింగ్ వంటి రంగాల్లో శిక్షణ ఇస్తామన్నారు. పని నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్నవారితో పాటు ఇప్పటికే పని వచ్చిన వారికి కూడా నైపుణ్యాలు అందిస్తారు అని చెప్పారు. కొత్తగా శిక్షణ పొందాలనుకునే వారి కోసం 35 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి 3 బ్యాచ్‌లుగా ఒక్కో బ్యాచ్‌కు 30 మంది చొప్పున ఒకేసారి 90 మందికి 3 నెలల పాటు శిక్షణ ఇస్తారని వివరించారు. శిక్షణ సమయంలో హాస్టల్ వసతితో పాటు భోజనం కల్పిస్తారని, 3 నెలలు పూర్తయ్యాక సర్టిఫికెట్ అందజేసి నైపుణ్యాలకు తగిన అవకాసాలు కూడా ఇప్పిస్తారని తెలిపారు. ఇప్పటికే పని తెలిసిన వారికి 15 రోజుల పాటు 45 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారికి రిఫ్రెషర్ శిక్షణ నిర్వహిస్తారని, రోజుకు రూ. 300 చొప్పున శిక్షణ భత్యంగా అందజేస్తారని చెప్పారు. శిక్షణ సమయం లో మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేస్తారని, శిక్షణ ముగిశాక సర్టిఫికెట్ ఇస్తారని వెల్లడించారు. శిక్షణకు హాజరయ్యే వారు తప్పనిసరిగా రేషన్ కార్డుతో పాటు ఆధార్ కార్డు, బ్యాంక్ పాస్ బుక్ జిరాక్స్ కాపీలను కార్యాలయంలో అందజేసి నమోదు చేసుకోవాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు పేర్కొన్నారు. ఈ కార్యక్రమం మార్కెట్ కమిటీ చైర్మన్ గవిరెడ్డి వెంకటరమణ, స్టేట్ వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ సూర్యచంద్ర, వార్డు కౌన్సిలర్లు, అధికారులు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక మేజర్ పంచాయతీలో ప్రజాస్వామ్యానికి తూట్లు

- ప్రజాభిప్రాయాన్ని పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్ష నిర్ణయం
- త్వరలోనే మానవహక్కుల కమిషనర్ కు ఫిర్యాదు చేస్తా
- బిజెపి జాతి కౌన్సిల్ మాజీ సభ్యులు డాక్టర్ బద్దెం సూర్యనారాయణ

మునగపాక, నవంబర్ 27, మనసులో మాట



మండల కేంద్రం మునగపాక మేజర్ పంచాయతీలో సర్పంచ్ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం కూని అయ్యేవిధంగా రైతు సంఘం ముసుగులో కూటమి, వైసిపి పార్టీలు కుమ్మక్కై ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచారని బిజెపి సీనియర్ నాయకుడు జాతీయ కౌన్సిల్ మాజీ సభ్యులు డాక్టర్ బద్దిన్ సూర్యనారాయణ ఆక్షేపించారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ప్రజలకు ఓటు వేసే హక్కు లేకుండా హరించి వేశారని, గ్రామంలో ఎప్పుడూ లేని సంప్రదాయాన్ని తీసుకొచ్చి డబ్బున్న వ్యక్తికే భారీ స్థాయిలో కోట్ల రూపాయలతో కొనుగోలు చేసి సర్పంచ్ పదవిని అమ్మేసుకున్నారని సూర్యనారాయణ ఆరోపించారు. గ్రామంలో ఏకపక్షం చేద్దామంటే గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలను, అన్ని మూల సంఘాల రైతులను పిలిచి మంచి వ్యక్తిని ఎన్నుకుందాం. మీ అభిప్రాయాన్ని తెలియ చేయండి సమాసం ఏర్పాటు చేయాలి. గ్రామం అంతా ఈ విషయం తెలిసే విధంగా టాముకు ద్వారా ప్రచారం నిర్వహించి ప్రజలందరూ అభిప్రాయాలను పరిగణలో తీసుకోవాలని కానీ ఇటువంటి నిర్ణయం ఎక్కడ జరగలేదని ఆయన గుర్తు చేశారు. ఐదు సంవత్సరాలకి ఒక్కసారి ఓటు వేసే హక్కు రాజ్యాంగం కల్పించిందని ఈ హక్కును హరించవేయడానికి మీరు ఎవరని సూర్యనారాయణ ప్రశ్నించారు. ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులు, విత్డ్రా అయ్యే రోజు మధ్యాహ్నం మూడు గంటలకు పోటీలో లేని వ్యక్తులు అంతా విత్ డ్రా చేసుకోవాలని ప్రభుత్వ నిర్ణయాన్ని పక్కన పెట్టేసి రాత్రి 11 గంటల వరకు ఆయా పార్టీల వార్డు సభ్యుల ఎంపిక కోసం చెయ్యరాన్ని తప్పులు చేశారని, దీనికి సహకరించిన ఎన్నికల అధికారుల పైన ఫిర్యాదు చేయడం జరుగుతుందని, గ్రామంలోని అన్ని వర్గాల ప్రజలు కూడా ఏకగ్రీవం చేసిన వ్యక్తులను నానా శాపనార్థాలు పెడుతున్నారని, ఏకగ్రీవం చేద్దామనుకున్నా నిర్ణయం ఉంటే ఎంపీటీసీల నుండి ఏకగ్రీవం చేయాలి కానీ సర్పంచ్ ఎన్నికల్లో ఈ ఆలోచన ఎందుకు వచ్చిందని ఆయన ప్రశ్నించారు. త్వరలోనే మానవ హక్కుల కమిషన్ దృష్టికి ఈ పంచాయతీలో జరిగిన తంతును ఉన్నతాధికారులు దృష్టికి తీసుకు వస్తానని సూర్యనారాయణ తెలిపారు.

రాజ్యాంగంతో పౌరుల హక్కులకు రక్షణ : సీపీ శంఖబ్రత బాగ్చి

ఎన్‌పడి, మనసులో మాట, నవంబర్ 27:





భారత రాజ్యాంగం పౌరుల హక్కులకు రక్షణ కల్పిస్తోందని నగర పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి అన్నారు. ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జైభీమ్ కల్చరల్ అండ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 77వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా చైతన్య సదస్సు, రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సీపీ, అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ హక్కులకు భంగం కలిగినప్పుడు రాజ్యాంగంలోని అధికరణ 32 ద్వారా ఉన్నత న్యాయస్థానాలను ఆశ్రయించి న్యాయం పొందవచ్చన్నారు. రక్తదానం ప్రాణదానంతో సమానమని పేర్కొంటూ రక్తదాతలను అభినందించారు. అనంతరం రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు. రాజ్యాంగ పరిరక్షణలో నేటి తరం పాత్రపై జరిగిన చర్చలో వివిధ వర్గాల ప్రతినిధులు పాల్గొని రాజ్యాంగ స్ఫూర్తితో సోదరభావంతో మెలుగుతామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో న్యూరో సైకియాట్రిస్ట్ డా. బి. రమేష్ బాబు, జైభీమ్ కన్వీనర్ కోన సూర్యప్రకాష్, 54వ వార్డు కార్పొరేటర్ ఈతల పాక సుజాత, సీఐ లూథర్ బాబు, పోర్ట్ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనతోనే బాలికలకు ఆరోగ్యకరమైన ఉజ్వల భవిష్యత్తు సాధ్యం

శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి , నవంబర్ 27: (మనసులో మాట)





బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నిర్మూలించడం ద్వారానే బాలికల ఆరోగ్యం, భద్రత మరియు ఉజ్వల భవిష్యత్తు సాధ్యమవుతుందని స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారిణి పి. శోభారాణి అన్నారు. అంతర్జాతీయ బాల్య దశ బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవం సందర్భంగా బాల్య వివాహ ముక్త భారత్ 100 రోజుల ప్రచార కార్యక్రమం'లో భాగంగా శుక్రవారం ఎచ్చెర్ల మండలం చిలకపాలెం గ్రామంలోని శివానీ కళాశాల ప్రాంగణంలో ఉన్న ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో ఇంజనీరింగ్ విద్యార్థినులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఐసీడీఎస్ పీడీ పి. శోభారాణి మాట్లాడుతూ, చిన్న వయసులోనే వివాహాలు చేయడం వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటారని, వారి విద్యాభివృద్ధికి ఆటంకం కలుగుతుందని వివరించారు. బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలను తెలియజేస్తూనే, బాల్య వివాహ నిరోధక చట్టం కింద తీసుకునే కఠిన చట్టపరమైన చర్యల గురించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు.ఈ సదస్సులో జిల్లా ఆర్బీఎస్కే కోఆర్డినేటర్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వి. అరవింద్, విద్యాశాఖ జీసీడీఓ వి. ఉమా, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ కె. రామకృష్ణ, ఎచ్చెర్ల పీహెచ్‌సీ కమ్యూనిటీ ఆఫీసర్ బి. రమేష్ బాబు, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డీఎంసీ ఉమామహేశ్వరి, బాలల సంక్షేమ సమితి (సీడబ్ల్యూసీ) సభ్యులు విజయభాస్కర్, ఆర్. జాస్మిన్ కుమార్, ఎచ్చెర్ల మండల విద్యాశాఖ అధికారి, ఐసీడీఎస్, జిల్లా బాలల రక్షణ విభాగం సిబ్బంది పాల్గొన్నారు.

అవయవదాన దినోత్సవం సందర్భంగా రవికుమార్ నేత్రదానం

శ్రీకాకుళం జిల్లా ప్రతినిధి : నవంబర్ 27: (మనసులో మాట)



మరణించిన తర్వాత మరొకరికి అవయవాలు దానం చేయడం జీవితాన్ని ప్రసాదించడమే అవయవదానమని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ శ్రీకాకుళం జిల్లా చైర్మన్ పి. జగన్మోహన్ రావు అన్నారు. అవయవదాన దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీకాకుళం రెడ్‌క్రాస్ కార్యాలయంలో ఆ సంస్థ జీవితకాల పేట్రన్ సభ్యులు, ప్రముఖ సేవా కార్యక్రమాల నిర్వాహకులు పొన్నాడ రవికుమార్ నేత్రదానం (అంగీకార పత్రం అందజేత) చేశారు. ఈ సందర్భంగా జగన్మోహన్ రావు మాట్లాడుతూ.. ఒకరి నేత్రదానం వల్ల అంధత్వంతో బాధపడుతున్న ఇద్దరికి చూపును ప్రసాదించవచ్చని, అలాగే అవయవదానం ద్వారా అనేకమంది ప్రాణాలను కాపాడి వారి కుటుంబాల్లో వెలుగులు నింపవచ్చని పేర్కొన్నారు. నేత్రదాత పొన్నాడ రవికుమార్ మాట్లాడుతూ.. మరణానంతరం కూడా మన కళ్ల ద్వారా మరొకరు ప్రపంచాన్ని చూడగలగడం కంటే గొప్ప సంతృప్తి ఉండదని, ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకుని స్ఫూర్తిగా నిలవాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో నెహ్రూ యువజన అవార్డు గ్రహీత పెంకి చైతన్య, రెడ్‌క్రాస్ జీవితకాల సభ్యులు ఉర్లం శివతేజ పట్నాయక్, పొడుగు చరణ్ తదితరులు పాల్గొన్నారు.

హరిశ్చంద్రపురం చరిత్ర తిరగరాసిన "ఝాన్సీ రాణి"

టెక్కలి,నవంబర్ 27 (మనసులో మాట) :



ఒకనాటి అసెంబ్లీ నియోజకవర్గ కేంద్ర మైన హరిశ్చంద్రపురం చరిత్ర తిరగ రాసింది ప్రస్తుత పంచాయతీ ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ తరఫున పోటీ చేసిన ఉప్పాడ ఝాన్సీ రాణి జయరామ్. ప్రతి ఎన్నికల్లో పోటాపోటీగా ఉండే హరిశ్చం ద్రపురం పంచాయతీ నేడు పంచాయతీ ప్రజలు, నేతలు సమిష్టి కృషి ఫలితంగా శుక్రవారం జరిగిన నామినేషన్ల ఉపసం హరణలో ఆమె ఏకగ్రీవంగా విజయం సాధించారు. పంచాయతీ అభివృద్ధినీ కాంక్షిస్తూ పంచాయతీకి చెందిన అన్ని వర్గాలు, అన్ని పార్టీలు ఒకే తాటి పైకి వస్తూ ఝాన్సీరాణి జై రామ్ ను సర్పంచ్ గా ఏకగ్రీవంగా బలపరిచారు. దీనిపై సర్వత్ర హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చం నాయుడు, మాజీ పి.ఎ.సి.ఎస్ అధ్యక్షు డు కింజరాపు హరివర ప్రసాదులు ఝాన్సీ రాణి జయరాం లను అభినందించారు. ఈ ఏకగ్రీవానికి కృషి చేసిన ప్రతి ఒక్కరికి వారు కృతజ్ఞతలు తెలిపారు. హరిశ్చం ద్రపురం పంచాయతీ అభివృద్ధికి తమ సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని వారు హామీ ఇచ్చారు.

నాలుగు పంచాయతీ లు ఏకగ్రీవం

చీడికాడ, నవంబర్ 27
(మనసులో మాట)



మండలంలో పంచాయతీ లు ఏకగ్రీవం అయ్యాయి మండలం లో అప్పులరా జుపురం ఎల్బిపట్నం బి సింగవరం ప్రఅడవి అగ్రహారం పంచాయతీలు కు సర్పంచ్ లు వార్డు మెంబర్ లుకు ఒకే ఒక్క నామినేషన్ లు పడ్డటంతో ఆ పంచాయతీ లు ఏకగ్రీవం అయ్యాయి అప్పలరాజు పురం పంచాయతీ సర్పంచ్ గా గవిరెడ్డి రమాదేవి ఉప సర్పంచ్ గా గవిరెడ్డి శ్రీనివాసరావు ఎల్బి పట్నం సర్పంచ్ గా కుదరా గోవింద ఉప సర్పంచ్ గా కాసులు బి సింగవరం సర్పంచ్ గా శరగడం లక్ష్మి ఉప సర్పంచ్ గా శరగడం శివ అడవి అగ్ర హరం సర్పంచ్ గా గుంపాన సన్యసమ్మ ఉపసర్పంచ్ గా నమ్మి బాలరాజు ఆ పం ఛాయతీలుకు చెందిన వార్డు మెంబర్ లు ఏకగ్రీవంగా ఎన్ని కయ్యారు వీరికి అర్వోలు ఎన్ని క దృవీకరణ పత్రాలు అంద జేసారు

గాదిరాయి పంచాయతీ ఏకగ్రీవం



- **సర్పంచ్‌గా పెంటకోట భవాని.. ఉప సర్పంచ్‌గా బర్రె రామోజీ**

వి మాడుగుల, నవంబర్ 27
(మనసులో మాట)

అనకాపల్లి జిల్లా వి. మాడుగుల మండలం గాదిరాయి గ్రామ పంచాయతీ ఎన్నికలు ఏకగ్రీవంగా ముగిశాయి. టీడీపీ, వైసీపీ నాయకుల మధ్య కుదిరిన ఒప్పందం మేరకు సర్పంచ్‌గా పెంటకోట భవాని, ఉప సర్పంచ్‌గా బర్రె రామోజీ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఐదేళ్ల పదవీకాలంలో చెరో రెండున్నరేళ్లు సర్పంచ్ పదవిని పం చుకోవాలని, మొత్తం 10 వార్డుల్లో ఇరు పార్టీలకు చెరో ఐదు స్థానాలు కేటాయిం చాలని నిర్ణయించారు. పంచాయతీ ఏకగ్రీవం కావడంపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.

పాడేరు జిల్లా ఆసుపత్రిలో వైద్య సేవలు బేజారు!

(మొదటి పేజీ తరువాయి)

అయితే బాధితురాలికి అవసరమైన తదుపరి చికిత్సను వెంటనే అందించాల్సిన సమయంలో వివిధ పరీక్షల పేరుతో మూడు రోజులపాటు ఆసుపత్రిలోనే ఉంచారని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. చివరకు తమ ఆసుపత్రిలో అవసరమైన ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో లేరని, మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నంలోని కింగ్ జార్జ్ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించినట్లు వా పోతున్నారు.

ఇప్పటికే తీవ్ర ఆందోళనలో ఉన్న కుటుంబా నికి ఈ పరిణామం మరింత ఇబ్బందికరం గా మారింది. ఒకవైపు గర్భిణి ఆరోగ్య పరి స్థితిపై ఆందోళన, మరోవైపు విశాఖకు తర లించాల్సిన అత్యవసర పరిస్థితి ఎదురైంది. ఇలాంటి సమయంలో కనీసం అంబులెన్స్ సౌకర్యం కోసం కూడా కుటుంబ సభ్యులు నిరీక్షించాల్సి వచ్చిందన్న ఆరోపణలు ఆసు పత్రి అత్యవసర వైద్య సేవలపై తీవ్ర ప్రశ్నలు లేవనెత్తుతున్నాయి. ప్రత్యేక వైద్యులు అం దుబాటులో లేకపోతే ముందుగానే ఉన్నత వైద్య కేంద్రానికి తరలించే ఏర్పాట్లు ఎందుకు చేయలేదన్న ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి.

గర్భిణులకు కనీస సౌకర్యాలూ కరువేనా?

పాడేరు జిల్లా ఆసుపత్రిలో గర్భిణులకు కనీస సౌకర్యాలు కూడా సక్రమంగా అందడం లేదని పలువురు రోగులు, వారి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. వైద్య పరీక్షల కోసం గర్భిణులు మెట్లు ఎక్కుతూ, దిగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నా, వారి వద్దకే వెళ్లి పరీక్షలు నిర్వహించే చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆసుప త్రిలోని మరుగుదొడ్లలో రన్నింగ్ వాటర్ సౌకర్యం సైతం సక్రమంగా లేదని, ఇతర మౌలిక వసతుల కొరతతో రోగులు ఇబ్బం



దులు పడుతున్నారని విమర్శిస్తున్నారు.

ప్రసవాల పేరుతో డబ్బుల వసూళ్ల ఆరోపణలు!

ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రసవాల అనంతరం కొంతమంది సిబ్బంది పేద గిరిజన కుటుంబాల నుంచి డబ్బులు వసూలు చేస్తు న్నారనే ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచిత వైద్య సేవలు అందించాల్సి ఉండగా, ప్రసవం అనంతరం నగదు అడుగుతున్నారన్న ఫిర్యాదులు రావడం ఆందోళనకరం. ఈ ఆరోపణల్లో వాస్తవాలను ఉన్నతాధికారులు పరిశీలించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

ఉన్నతాధికారుల పర్యవేక్షణ ఏదీ?

జిల్లా కేంద్రంలో ఉన్న ప్రధాన ప్రభుత్వ ఆసు పత్రిలోనే ఇలాంటి పరిస్థితులు నెలకొంటే మారుమూల గిరిజన ప్రాంతాల్లోని వైద్య సేవల పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా కలెక్ట ర్, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఆసుపత్రిని ఎప్పటికప్పుడు సందర్శించి వైద్య సేవలు, సిబ్బంది పనితీరు, మౌలిక సదుపాయా లను పరిశీలించాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు. ఆసుపత్రిలో నెలకొన్న సమస్యలను పలుమార్లు ఉన్న తాధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఆశించిన స్థాయిలో స్పందన లేదని బాధితులు ఆరో పిస్తున్నారు.

ప్రకటనలు కాదు.. ప్రాణాలు కాపాడే వైద్యం కావాలి!

గిరిజన ప్రాంతాల్లో వైద్య సేవలను మెరుగుప రుస్తున్నామని, డ్రోన్ల ద్వారా మందులు, వైద్య పరికరాలు అందిస్తున్నామని పాలకులు ప్ర కటిస్తున్నప్పటికీ జిల్లా కేంద్రంలోని ప్రధాన ఆసుపత్రిలోనే అత్యవసర వైద్య సేవలు అంద కపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గర్భంలోని శిశువు మృతి చెందినట్లు గుర్తిం చిన ఎనిమిది నెలల గర్భిణికి అవసరమైన చి కిత్సను సకాలంలో అందించాల్సిన బాధ్యత ఆసుపత్రి యంత్రాంగంపై లేదా? ప్రత్యేక వైద్య నిపుణులు అందుబాటులో లేకుంటే ముందుగానే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి ఉన్నత వైద్య కేంద్రానికి తరలించాల్సిన అవసరం లేదా? అన్న ప్రశ్నలు ఉత్పన్నమ వుతున్నాయి.

ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవో, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తక్ష ణమే స్పందించి సమగ్ర విచారణ చేపట్టా లని ప్రజలు కోరుతున్నారు. బాధితురాలికి అవసరమైన వైద్యం అందించడంతోపాటు, ఆసుపత్రిలో అత్యవసర అంబులెన్స్ సేవలు, గైనకాలజీ సహా ప్రత్యేక వైద్య నిపుణుల అందుబాటు, గర్భిణులకు అనుకూలమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఠాగూర్ సినిమాలో చూపించినట్లుగా ప్ర భుత్వ వైద్య వ్యవస్థలోని లోపాలు మరోసారి బయటపడ్డాయా? పాడేరు జిల్లా ఆసుప త్రిలో వైద్య సేవలపై వస్తున్న ఆరోపణలకు జిల్లా యంత్రాంగం ఎలాంటి సమాధానం చెబుతుంది? ప్రకటనలకే పరిమితమవు తారా.. లేక గిరిజనుల ప్రాణాలకు భరోసా కల్పించేలా వైద్య వ్యవస్థను ప్రక్షాళన చేస్తారా? అన్నది వేచి చూడాలి.

రైతుల చేతిలోనే ఎరువుల పంపిణీ..అందుబాటులోకి 'ఎఫ్ఎఫ్ఎస్' యాప్

- **క్యూఆర్ కోడ్ ద్వారా సులభంగా ఎరువుల బుకింగ్**
- **రైతులకు 'ఫార్మర్ రిజిస్ట్రీ' నంబర్ తప్పనిసరి - ఏడీఏలు శ్రీధర్, సుమంత్**

యలమంచిలి , నవంబర్ 27,
మనసులో మాట,



రైతులకు ఎరువుల పంపిణీని మరింత సు లభతరం, పారదర్శకం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నూతన విధానాన్ని అం దుబాటులోకి తెచ్చాయని జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకులు శ్రీధర్ తెలిపారు. శుక్రవారం యలమంచిలిలోని వ్యవసాయ సహాయ సంచాలకుల కార్యాల యంలో ఎరువుల పంపిణీ కొత్త విధానంపై రైతు సేవా కేంద్రాల సిబ్బంది, సొసైటీ అధి కారులు, ఎరువుల డీలర్లకు అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ శ్రీధర్ మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు 'ఎఫ్ఎఫ్ఎస్' (ఫ్రేమ్‌వర్క్ ఫర్ ఫెర్టిలైజర్ సేల్) యాప్ నూతనంగా అమల్లోకి వచ్చిందన్నారు. ఈ యాప్ ద్వారా రైతులు తమ మొబైల్ ఫోన్ల నుంచే సాగు చేస్తున్న పంటల సరళిని బట్టి కావలసిన ఎరువులను నమోదు చేసుకో వచ్చని, తద్వారా జనరేట్ అయ్యే క్యూఆర్ కోడ్ సాయంతో డీలర్ల వద్ద నేరుగా ఎరువు లను బుక్ చేసుకుని పొందవచ్చని వివరిం చారు. ప్రస్తుత రబీ పంట కాలాన్ని దృష్టిలో ఉంచుకుని రైతులందరూ ఈ నూతన విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యలమంచిలి వ్యవసాయ సహాయ సంచాలకులు సుమంత్ మాట్లాడు తూ, ఈ నూతన విధానం ద్వారా ఎరువులు పొందేందుకు రైతులకు 'ఫార్మర్ రిజిస్ట్రీ నంబర్' తప్పనిసరిగా ఉండాలన్నారు. రిజిస్ట్రీ నంబర్ లేని రైతులు వెంటనే సమీపంలోని రైతు సేవా కేంద్రం సిబ్బందిని సంప్రదించి నమోదు చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు దీనిపై విస్తృత అవగాహన కల్పిస్తామని, ఇప్పటికే రైతు సేవా కేంద్రాలు, డీలర్ పాయింట్ల వద్ద ఈ విధానంలో ఎరువుల విక్రయాలు ప్రారంభమయ్యాయని తెలిపారు. మండల వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఏడీఏ ఉమా ప్రసాద్, మండల వ్యవసాయ అధికారులు మోహన్ రావు, సౌజన్య, శంకర్, గోవిందు, గ్రామ వ్య వసాయ సహాయకులు, వ్యవసాయ విస్తరణ అధికారులు, ఎరువుల డీలర్లు పాల్గొన్నారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

రహదారి భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనకు సమన్వయంతో పటిష్ట చర్యలు చేపట్టాలి

- విద్యాసంస్థలు, వసతి గృహాలు, మెడికల్ షాపులపై నిరంతర పర్యవేక్షణ
- గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలి
- ఆపరేషన్ త్రిశూల్, ఎన్‌కార్డ్ కార్యక్రమాల అమలుపై అధికారులతో సమీక్షించిన కలెక్టర్, ఎస్పీ

పార్వతీపురం జిల్లా ప్రతినిధి , నవంబర్ 27
మనసులో మాట :



జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా, విక్రయాలను అరికట్టేందుకు సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్. ప్రభాకర రెడ్డి, జిల్లా ఎస్పీ ఎస్.వి. మాధవ రెడ్డి ఆదేశించారు శుక్రవారం సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన కలెక్టర్, ఎస్పీ రహదారి భద్రత, ఆపరేషన్ త్రిశూల్, ఎన్‌కార్డ్ కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ నిబంధనల అమలు, వాహనాల తనిఖీలు, ఎన్‌డీపీఎస్ కేసుల నమోదు, నిందితుల అరెస్టులు, మాదకద్రవ్యాల నియంత్రణకు చేపడుతున్న చర్యలు, శాఖల వారీగా పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రహదారులపై వాహనాలను ఇష్టానుసారంగా నిలిపి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే వారిపై చర్యలు తీసుకోవాలని, నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలను నిలిపేలా అవగాహన కల్పించాలని సూచించారు. రహదారులపై వాహనదారులకు ఇబ్బందులు కలిగించే పొదలు, చెట్ల కొమ్మలను తొలగించాలని, ప్రమాదాలకు కారణమయ్యే ప్రాంతాలను గుర్తించి అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వాహనాలకు నిబంధనలకు విరుద్ధంగా అమర్చిన లైట్లు, అనధికారిక మార్పులు, అధిక శబ్దం కలిగించే హారన్లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని తెలిపారు. జాతీయ రహదారి పై ప్రమాదాలు జరిగినప్పుడు క్షతగాత్రులకు తక్షణ వైద్య సహాయం అందించేందుకు అంబులెన్స్, క్రేన్ వంటి అత్యవసర సేవలు అందుబాటులో ఉండాలని జిల్లా కలెక్టర్ సూచించగా, ప్రస్తుతం మానాపురం రైల్వే ఓవర్ బ్రిడ్జి వద్ద అంబులెన్స్, క్రేన్ సదుపాయాలు ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా విద్యాసంస్థలు, కళాశాలలు, వసతి గృహాల్లో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. జూనియర్ కళాశాలల్లో ఈగల్ క్లబ్బులను చురుకుగా పనిచేయిస్తూ విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో యాజమాన్యాల సమన్వయంతో ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని, ప్రతి కళాశాలలో ఒక నోడల్ అధికారిని నియమించి కార్యక్రమాలను పర్యవేక్షించాలని ఆదేశించారు వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించాలని, మాదకద్రవ్యాల వినియోగానికి సంబంధించిన అనుమానాలు తలెత్తినప్పుడు అవసరమైన వైద్య సహాయం, కౌన్సెలింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఎన్ఎంల ద్వారా గ్రామస్థాయిలో ప్రజలకు, విద్యార్థులకు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలన్నారు.

బీసీ సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థుల ప్రవర్తన, హాజరు, విద్యా ప్రగతిపై ప్రత్యేక దృష్టి సారించాలని, వసతి గృహాల్లో క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు, నిపుణులతో ప్రసంగాలు, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. మెడికల్ షాపులపై కూడా సంబంధిత శాఖలు నిరంతర పర్యవేక్షణ చేపట్టి నిబంధనల అమలును పరిశీలించాలని సూచించారు. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం, గంజాయి అక్రమ విక్రయాలు, సరఫరా వ్యవస్థలపై నిఘా పెంచాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో గుర్తించిన 14 మంది వ్యక్తులకు ప్రత్యామ్నాయ జీవనోపాధి కల్పించే అంశాన్ని పరిశీలించి, అర్హులైన వారికి స్వయం సహాయక సంఘాల ద్వారా రుణాలు, ఇతర ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపట్టినట్లు అధికారులు వివరించారు. పునరావృత నేరాలకు పాల్పడుతున్న వ్యక్తులు, వారి నెట్‌వర్క్‌లపై ప్రత్యేక నిఘా ఉంచి అక్రమ గంజాయి సరఫరా, విక్రయాలను అరికట్టాలని సూచించారు. రహదారి భద్రత, మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ నిర్దేశించిన లక్ష్యాలను క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కలెక్టర్, ఎస్పీ స్పష్టం చేశారు.

లుంగపర్తి సర్పంచ్ అభ్యర్థి జన్ని నందినికి విశేష ప్రజాదరణ



- ఇంటింటి ప్రచారంలో మహిళలు హారతులతో ఘన స్వాగతం
- అభివృద్ధిని కాంక్షిస్తూ అండగా నిలుస్తున్న గ్రామస్తులు-

అనంతగిరి నవంబర్ 27
మనసులో మాట

అల్లూరి జిల్లా అనంతగిరి మండలం లుంగపర్తి గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థి జన్ని నందిని కి పంచాయితీ ఎన్నికల ప్రచారానికి గ్రామస్తుల నుండి విశేష స్పందన లభిస్తోంది. శుక్రవారం గ్రామంలోని పలు వీధుల్లో అభ్యర్థి నిర్వహించిన ఇంటింటి ప్రచార కార్యక్రమంలో ప్రజలు, ముఖ్యంగా మహిళలు హారతులతో ఎదురొచ్చి ఘన స్వాగతం పలికారు. ప్రచారంలో భాగంగా అభ్యర్థి ప్రతి ఇంటికి వెళ్లి గ్రామ అభివృద్ధి కోసం తాను చేయబోయే పనులను, తన ప్రణాళికలను ప్రజలకు వివరించారు. గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పన, తాగునీటి సమస్యల పరిష్కారం రహదారుల నిర్మాణం మరియు ప్రభుత్వ సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, గ్రామ సమస్యలపై అవగాహన ఉన్న నాయకురాలు సర్పంచ్‌గా గెలిపించుకుంటామని ఆశాభావం వ్యక్తం చేశారు. యువత, పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున ప్రచారంలో పాల్గొని అభ్యర్థికి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు.

ఈ ప్రచార కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి దూరు గంగన్న దొర మాజీ సర్పంచ్ సెంబి సన్యాసిరావు మాజీ ఎంపీటీసీ జన్ని చందర్రావు మాజీ సర్పంచ్ జన్ని సన్యాసిరావు వైఎస్ఆర్సిపి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

హుకుంపేట సర్పంచ్ పీఠంపై ఉత్కంఠ.. బరిలో 11 మంది అభ్యర్థులు!

హుకుంపేట నవంబర్ 27
మనసులో మాట

హుకుంపేట మండల కేంద్రంలోని సర్పంచ్ పదవికి ఎన్నడూ లేనివిధంగా భారీ పోటీ నెలకొంది. ఈసారి ఏకంగా 11 మంది అభ్యర్థులు బరిలో నిలవడంతో సర్పంచ్ పీఠం ఎవరిని వరిస్తుందన్న అంశంపై మండలవ్యాప్తంగా ఆసక్తికర చర్చ సాగుతోంది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరపున ఒక అభ్యర్థిని అధికారికంగా ప్రతిపాదించగా, మరో ఐదుగురు రెబల్ అభ్యర్థులుగా పోటీకి దిగారు. తెలుగుదేశం పార్టీ తరపున ఒక అభ్యర్థిని ప్రతిపాదించగా, మరో ముగ్గురు రెబల్ అభ్యర్థులుగా బరిలో నిలిచారు. వీరితో పాటు ఒక స్వతంత్ర అభ్యర్థి పోటీలో ఉన్నారు. గతంలో హుకుంపేట సర్పంచ్ పదవికి ముగ్గురు, నలుగురు లేదా ఐదుగురు మాత్రమే పోటీ పడేవారు. అయితే ఈసారి ఏకంగా 13 మంది నామినేషన్లు దాఖలు చేశారు. అందులో 11 మంది పోటీలో ఉండటం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. హుకుంపేటలో మొత్తం 2,100 ఓట్లు ఉండగా, అభ్యర్థుల మధ్య ఓట్లు చీలిపోయే అవకాశాలు ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో 250కి పైగా ఓట్లు సాధించిన అభ్యర్థికి గెలుపు అవకాశాలు ఉండవచ్చన్న చర్చ కూడా వినిపిస్తోంది. మొత్తానికి భారీ పోటీ, రెబల్ అభ్యర్థుల ప్రభావం, ఓట్ల చీలిక నేపథ్యంలో హుకుంపేట సర్పంచ్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా మారింది. చివరకు ఓటర్లు ఎవరికి పట్టం కడతారో వేచి చూడాల్సిందే.

సంతబొమ్మాలి పంచాయతీ టిడిపి సర్పంచిగా మెండ అప్పారావు ఏకగ్రీవం





- సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ చరిత్రలో సరికొత్త అధ్యాయం
- సర్పంచ్‌తో పాటు 14 వార్డులూ ఏకగ్రీవం

టెక్కలి, నవంబర్ 27
(మనసులో మాట) :

సంతబొమ్మాళి మండలం లోనే అతి పెద్ద గ్రామ పంచాయతీగా గుర్తింపు పొందిన సంతబొమ్మాళిలో రాజకీయ ఐకమత్యానికి,సమష్టి నిర్ణయానికి నిదర్శనంగా చారిత్రాత్మక పరిణామం చోటుచేసుకుంది. గ్రామ పంచాయతీ టిడిపి సర్పంచ్ గా మెండ అప్పారావు ఎన్నికై గ్రామ పంచాయతీ చరిత్రలో సరికొత్త అధ్యాయం సృష్టించారు. గ్రామ అభివృద్ధి,ప్రజా సంక్షేమం లక్ష్యంగా సంతబొమ్మాళి గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానంతో పాటు పంచాయతీ పరిధిలోని మొత్తం 14 వార్డుల సభ్యుల స్థానాలు సైతం శుక్రవారం జరిగిన నామినేషన్ల ఉపసంహరణలో ఏకగ్రీవమయ్యాయి. ఏకగ్రీవమైన సర్పంచ్ తో పాటు మొత్తం వార్డు సభ్యులంతా టిడిపి మద్దతుదారులు కావడం మరో విశేషం. గ్రామ రాజకీయాల్లో భిన్నాభిప్రాయాలు,పోటీలు సహజమైనప్పటికీ, సంతబొమ్మాళి అభివృద్ధి దిశగా నాయకులు,కార్యకర్తలు సమష్టిగా తీసుకున్న నిర్ణయంతో ఈ అరుదైన ఫలితం సాధ్యమైంది. ఈ సందర్భంగా సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన మెండ అప్పారావు కి, వార్డు సభ్యులకు ఎంపీటీసీ కూచెట్టి భాను ప్రకాష్ , గ్రామస్తులు అభినందించారు.

ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో దోమల లార్వా నివారణపై ప్రజలకు అవగాహన

దేవరాపల్లి, నవంబర్ 27,
(మనసులో మాట) :



ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం దేవరాపల్లి మండల కేంద్రంలో గాంధీ వీధి, రామాలయం వీధిలో జిల్లా అధికారులు పర్యటించారు. డీఎంఓ కె.వి. దొర, ఏఎంఓ ఏ.జె. సత్యనారాయణ, సబ్ యూనిట్ ఆఫీసర్ ఎస్.వి.రమణ గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించారు. ఇళ్లలో, పరిసరాల్లో నిలిచిన నీటిలో దోమల లార్వా వృద్ధి చెందే అవకాశం ఉందని, దీనివల్ల జ్వరాలు వ్యాపించే ప్రమాదం ఉందని ప్రజలకు అవగాహన కల్పించారు.పాత టైర్లు, కొబ్బరి చిప్పలు, కూలర్లు, నీటి తొట్టెల్లో నిల్వ ఉన్న నీటిని ప్రతి శుక్రవారం తప్పనిసరిగా శుభ్రం చేయాలని సూచించారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.ఈ కార్యక్రమంలో సిహెచ్ఓ ఆనంద్, ఏఎన్ఎం మేరీ క్రాంతి, ఆశా కార్యకర్త వర లక్ష్మి పాల్గొన్నారు.

రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలకు పటిష్ట ఏర్పాట్లు చేయాలి

- **జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి**



విజయనగరం, నవంబర్ 27 (మనసులో మాట) :

జిల్లాలో రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, పారదర్శకంగా, ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. రెండవ దశ గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణ, సన్నద్ధతపై శుక్రవారం జిల్లా అధికారులు, ఆర్డీఓలు, డివిజన్ స్థాయి అధికారులు, ఎంపీడీఓలు, తహశీల్దార్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెండవ దశలో జిల్లాలోని 10 మండలాల్లో 308 గ్రామ పంచాయతీలకు గాను 64 పంచాయతీలు ఏకగ్రీవం కాగా, మిగిలిన 244 పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మొత్తం 1,996 వార్డులకు, 2,275 పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల విధుల కోసం 2,761 మంది పి.ఓలు, 3,395 మంది ఓ.పి.ఓలు, 310 వాహనాలను సిద్ధం చేయాలని సూచించారు.

సిబ్బంది హాజరుపై నిరంతర పర్యవేక్షణ

ఎన్నికల విధులకు నియమించిన సిబ్బంది హాజరుపై ప్రతి గంటకు పర్యవేక్షణ చేయాలని, గైర్హాజరైన సిబ్బంది వివరాలను సకాలంలో సేకరించి మధ్యాహ్నం 1 గంటలోపు ప్రాథమిక జాబితా, 3 గంటలలోపు తుది జాబితాను కలెక్టరేట్‌కు పంపాలని ఆదేశించారు. ఎన్నికల విధులకు హాజరుకాని సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవటం జరుగుతుందని స్పష్టం చేశారు. విధుల ఉత్తర్వులు సంబంధిత శాఖల అధికారుల ద్వారానే పంపిణీ చేసి, అందరికీ చేరినట్లు ధృవీకరించాలని తెలిపారు. రేగిడి ఆమదాలవలస, సంతకవిటి, జామి, గంట్యాడ మండలాల్లో సిబ్బంది అవసరం అధికంగా ఉన్నందున ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు.

భోజన ఏర్పాట్లపై ప్రత్యేక శ్రద్ధ

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు, పోలింగ్ కేంద్రాలు, రిసెప్షన్ కేంద్రాల్లో ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అందరికీ సరిపడా భోజనాన్ని ముందస్తుగా సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. భోజనం నాణ్యత, పరిమాణం విషయంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని, అవసరానికి తగిన విధంగా అదనపు ఆహారాన్ని కూడా సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో భోజన ఏర్పాట్లను ఎంపీడీఓలు, తహశీల్దార్లు స్వయంగా పర్యవేక్షించాలని, విధులు ముగించుకుని రాత్రి రిసెప్షన్ కేంద్రాలకు చేరుకునే సిబ్బందికి కూడా తప్పనిసరిగా భోజనం అందేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.

కౌంటింగ్ ప్రక్రియకు ముందస్తు ఏర్పాట్లు

ఓట్ల లెక్కింపు కేంద్రాల్లో తగినంత లైటింగ్, జనరేటర్లు, అవసరమైన కౌంటింగ్ టేబుళ్లు, బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. నిర్ణీత సమయానికి కౌంటింగ్ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని, అభ్యర్థులు లేదా ఏజెంట్ల కోసం వేచి చూస్తూ ఆలస్యం చేయరాదన్నారు. రీకౌంటింగ్ నిబంధనలపై ముందుగానే స్పష్టమైన అవగాహన కల్పించాలని సూచించారు. కౌంటింగ్ సమయంలో ఎలాంటి సమస్యలు తలెత్తినా సంబంధిత ఎంపీడీఓలు, తహశీల్దార్లు వెంటనే స్పందించి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ శాతంపై ఎప్పటికప్పుడు నివేదికలు

ప్రతి రెండు గంటలకు ఒకసారి పోలింగ్ శాతం, ఇతర ఎన్నికల వివరాలను ఆన్‌లైన్‌లో సకాలంలో నమోదు చేయాలని ఆదేశించారు. ఇందుకోసం ప్రతి ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేకంగా ఆన్‌లైన్ రిపోర్టింగ్ బృందం, జిల్లా కంట్రోల్ రూమ్‌కు సమాచారం అందించే మరో బృందాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ఎన్నికల రోజున జిల్లా కంట్రోల్ రూమ్ పూర్తిస్థాయిలో పనిచేసి, మండలాల నుంచి వచ్చే సమాచారాన్ని ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తుందని తెలిపారు.

సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలపై ప్రత్యేక నిఘా

జిల్లాలో గుర్తించిన 112 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో 67 సమస్యాత్మక, 45 అత్యంత సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయని, ఆయా ప్రాంతాల్లో పోలీసు శాఖతో సమన్వయం చేసుకుంటూ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ముఖ్యంగా రేగిడి ఆమదాలవలస మండలంపై ప్రత్యేక దృష్టి సారించాలని, గంట్యాడ, బొండపల్లి, రాజాం, గజపతినగరం, వంగర మండలాల్లో సమస్యాత్మక కేంద్రాల వద్ద ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు.

విద్యుత్, రవాణా ఏర్పాట్లలో లోటు ఉండకూడదు

పోలింగ్, కౌంటింగ్ సమయంలో నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా ఏపీఈపీడీసీఎల్ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు.

విశాఖ తీరంలో నేవీ విన్యాసాల సందడి!

- **డిసెంబర్ 4న నేవీ డే.. 13న వైజాగ్ నేవీ మారథాన్**
- **15 వేల మందికి పైగా పరుగులో పాల్గొనే అవకాశం..**
- **ఏర్పాట్లపై కలెక్టర్ అభిషిక్త్ కిషోర్ సమీక్ష**





విశాఖపట్నం, నవంబర్ 27 (మనసులో మాట):

విశాఖపట్నం తీరప్రాంతం మరోసారి నౌకాదళ వేడుకలకు, క్రీడా సంబరాలకు వేదిక కానుంది. డిసెంబర్ 4న ప్రతిష్ఠాత్మక నేవీ డే-2026 వేడుకలు, అదే నెల 13న వైజాగ్ నేవీ మారథాన్ నిర్వహించేందుకు అధికారులు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ రెండు కార్యక్రమాలను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నేవల్ అధికారులు, జిల్లా అధికారులతో నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిసెంబర్ 3న ఆర్కే బీచ్‌లో నేవీ డేకు సంబంధించి ఫుల్ డ్రెస్ రిహార్సల్స్ నిర్వహించనున్నట్లు తెలిపారు. డిసెంబర్ 4న నేవల్ ఆపరేషనల్ డెమాన్స్ట్రేషన్ (నౌకాదళ కార్యాచరణ విన్యాసాలు) జరగనున్నాయని వెల్లడించారు. ఈ కార్యక్రమాలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో ప్రజలు, అతిథులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ముఖ్యంగా ఆర్కే బీచ్ పరిసరాల్లో బారికేడింగ్, వాహనాల పార్కింగ్, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీరు, మరుగుదొడ్ల వంటి సౌకర్యాలు కల్పించేందుకు సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేయాలన్నారు. జనసందోహాన్ని నియంత్రించడంలో పోలీసు శాఖ ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని సూచించారు. నేవీ విన్యాసాలు జరిగే ప్రాంతాన్ని నో-డ్రోన్ ఫ్లై జోన్‌గా ప్రకటించాలని నేవీ అధికారులు కలెక్టర్‌ను కోరారు.

15 వేల మందితో నేవీ మారథాన్

డిసెంబర్ 13న విశాఖపట్నంలో నిర్వహించనున్న వైజాగ్ నేవీ మారథాన్-2026లో సుమారు 15 వేల మందికి పైగా పాల్గొనే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. తూర్పు నౌకాదళం నేపథ్యంలో నాలుగు విభాగాల్లో ఈ మారథాన్‌ను నిర్వహించనున్నట్లు వివరించారు.

- 42 కిలోమీటర్లు: ఎయిర్‌క్రాఫ్ట్ రన్
- 21 కిలోమీటర్లు: సబ్‌మెరైన్ రన్
- 10 కిలోమీటర్లు: ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ రన్
- 5 కిలోమీటర్లు: ఫ్రిగేట్ రన్

ఈ నాలుగు విభాగాల పరుగులు విశాఖలోని ఆర్కే బీచ్ నుంచి ప్రారంభమై తీరప్రాంతం మీదుగా భీమిలి సమీపంలోని ఐఎన్ఎస్ కళింగ వరకు కొనసాగనున్నాయి. మారథాన్ నిర్వహణకు సంబంధించి జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందించాలని నేవీ అధికారులు కోరారు.

ఆరోగ్యంతో పాటు నౌకాదళంపై అవగాహన

మారథాన్‌ల నిర్వహణ ద్వారా ప్రజల్లో శారీరక దృఢత్వం, ఆరోగ్యంపై అవగాహన పెరగడంతో పాటు విశాఖ తీరప్రాంత ప్రాధాన్యత, భారత నౌకాదళ కార్యకలాపాలపై ప్రజలకు మరింత అవగాహన కలుగుతుందని నేవీ అధికారులు పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో పాల్గొనేవారు, ప్రేక్షకులు తరలివచ్చే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ నియంత్రణ, భద్రత, రహదారుల నిర్వహణ, ఇతర మౌలిక సదుపాయాల కల్పనలో జిల్లా అధికారుల సహకారం అవసరమని తెలిపారు. మారథాన్‌కు సంబంధించిన పూర్తి వివరాల కోసం www.vizagnavymarathon.run వెబ్‌సైట్‌ను సందర్శించాలని, 7386007503, 9515448412 నంబర్లను సంప్రదించాలని నేవీ అధికారులు సూచించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి, డీసీపీ చందోలు మణికంఠ, డీఆర్వో ఎస్.డి. అనిత, రేస్ ఆర్గనైజర్ కమాండర్ ఎస్.ఎస్. దోడి, రేస్ కన్సల్టెంట్, రిటైర్డ్ అధికారి టి. రవికుమార్, ఆఫీసర్ ఇన్‌చార్జి లెఫ్టినెంట్ కమాండర్ రోషన్ సాహూ, పలువురు జిల్లా, నేవీ అధికారులు పాల్గొన్నారు.

పోలీసు సంస్మరణ వారోత్సవ పోటీల్లో ప్రతిభకు పట్టం.. విజేతలకు నగదు బహుమతులు

- **విద్యార్థులు, పోలీసు సిబ్బందికి వక్తృత్వం, వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహణ**



విజయనగరం, నవంబర్ 27 (మనసులో మాట):

పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహించిన సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా వివిధ పోటీల్లో ప్రతిభ కనబరిచిన విజేతలకు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్ నగదు బహుమతులు అందజేశారు. శుక్రవారం విజయనగరంలోని జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విజేతలను ప్రత్యేకంగా అభినందించి ప్రోత్సాహక బహుమతులను ప్రదానం చేశారు. జిల్లాలో అక్టోబర్ 21 నుంచి 31వ తేదీ వరకు పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను వివిధ కార్యక్రమాలతో నిర్వహించినట్లు ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా పోలీసు ఉద్యోగులు, వారి పిల్లలు, వివిధ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు వేర్వేరుగా వ్యాసరచన, వక్తృత్వం, చిత్రలేఖనం పోటీలను నిర్వహించినట్లు వివరించారు. ఈ పోటీల ద్వారా పోలీసు అమరవీరుల త్యాగాలు, సేవలు, సమాజం పట్ల పోలీసుల బాధ్యతలను యువతకు తెలియజేసే ప్రయత్నం చేసినట్లు పేర్కొన్నారు. పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన వారికి రూ.2,000, ద్వితీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1,500, తృతీయ స్థానంలో నిలిచిన వారికి రూ.1,000 చొప్పున నగదు బహుమతులు అందజేశారు. విజేతల ప్రతిభను అభినందించిన ఎస్పీ.. ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల్లో సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యతను పెంపొందిస్తాయని అన్నారు.

పోలీసు సిబ్బందిలో విజేతలు

పోలీసు ఉద్యోగులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో టి. నీలిమ (రిజర్వు సబ్ ఇన్‌స్పెక్టర్) ప్రథమ, పి. దేవి (ఏఎస్ఐ, డీసీఆర్‌బీ) ద్వితీయ, సీహెచ్. శంకరరావు (ఏఆర్ కానిస్టేబుల్) తృతీయ స్థానాలు సాధించారు. వక్తృత్వ పోటీల్లో జి. జనార్దనరావు (హెడ్ కానిస్టేబుల్, భోగాపురం), ఐ. ఝాన్సీరాణి (హోంగార్డు, బొబ్బిలి), పి. దామోదరరావు (హెడ్ కానిస్టేబుల్, నెల్లిమర్ల) వరుసగా మొదటి మూడు స్థానాల్లో నిలిచారు.

పోలీసు ఉద్యోగుల పిల్లల ప్రతిభ

పోలీసు ఉద్యోగుల పిల్లలకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో కే. సూర్య సృజన శ్రీ ప్రథమ, కే. మధన్ ద్వితీయ, పి. నెహోరిక తృతీయ స్థానాలు సాధించారు. వక్తృత్వ పోటీల్లో కే. రోహిత్ శ్రీనివాస్ ప్రథమ, ఎస్. రేష్మాశ్రీ ద్వితీయ, పి. దినీత్ వర్మ తృతీయ స్థానాల్లో నిలిచారు.

పోలీసు వెల్ఫేర్ స్కూలు విద్యార్థుల హవా

పాఠశాలలు, కళాశాలల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో పోలీసు వెల్ఫేర్ స్కూలు విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారు. వ్యాసరచన పోటీల్లో బి. యుగంధర్ ప్రథమ, ఎ. యామిని ద్వితీయ, పి. భార్గవ్ తృతీయ స్థానాలు పొందారు. వక్తృత్వ పోటీల్లో పి. భార్గవ్ ప్రథమ, బి. యుగంధర్ ద్వితీయ, ఎ. యామిని తృతీయ స్థానాల్లో నిలిచారు. చిత్రలేఖనం పోటీల్లో నారాయణ స్కూలుకు చెందిన పి. లసితశ్రీ ప్రథమ, పోలీసు వెల్ఫేర్ స్కూలుకు చెందిన బి. యుగంధర్ ద్వితీయ, విజయనగరం పోలీసు సంక్షేమ పాఠశాలకు చెందిన డి. మోనిష్ భాస్కర్ దాస్ తృతీయ బహుమతులు సాధించారు.

మనసులోమాట KANCHARLA నిజమే మా ఇజం.. అదే మా జర్నలిజం.. సంచలన తెలుగు దిన పత్రిక

ఓటు విలువను చాటిన భావి ఓటర్లు

- **వ్యాసరచన, క్విజ్ విజేతలకు కలెక్టర్ ప్రశంసలు**

విజయనగరం, నవంబర్ 27 (మనసులో మాట) :

భవిష్యత్తు ఓటర్లలో చైతన్యం నింపేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో జిల్లా యంత్రాంగం నిర్వహించిన వ్యాసరచన, క్విజ్ పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందాయి. జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తన చేతులమీదుగా విజేతలకు శుక్రవారం వీటిని బహూకరించారు. కాబోయే ఓటర్లకు ఎన్నికల ప్రక్రియపై అవగాహన పెంచడమే లక్ష్యంగా మొదట నియోజకవర్గ స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు జరిగాయి. అక్కడ గెలిచినవారికి జిల్లా స్థాయిలో మరో రౌండ్ నిర్వహించగా, వీరిలో 20 మందిని విజేతలుగా ఎంపిక చేశారు. "స్వచ్ఛమైన ఓటరు జాబితా ప్రాధాన్యత", "ఓటు విలువ" అంశాలపై వ్యాసరచన సాగింది. కలెక్టరేట్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్. సేధు మాధవన్, జిల్లా రెవెన్యూ అధికారి సి.హెచ్. సత్తిబాబు, ఎన్నికల విభాగ సూపరింటెండెంట్ ప్రసాద్‌తో పాటు ఇతర సిబ్బంది హాజరయ్యారు.

విజేతల వివరాలు

రాజాం నియోజకవర్గం :

- పి. సంధ్య (10వ తరగతి, వివేక్ స్కూల్, వంగర) - క్విజ్
- టి. రాజావర్ధన్ (మెకానికల్ డీజిల్, ప్రభుత్వ ఐటీఐ, రాజాం) - వ్యాసరచన





బొబ్బిలి

- కె. హర్షవర్ధన్ (10వ తరగతి, ఏపీఆర్ఎస్, బొబ్బిలి) - క్విజ్
- వై. చంద్రకళ (10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, ఆర్.బి. పురం) - వ్యాసరచన

చీపురుపల్లి

- పి. పవిత్ర (9వ తరగతి, జడ్పీహెచ్ఎస్, కొండపాలెం) - వ్యాసరచన
- జి. యశ్వంత్ కుమార్ (10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, పాలవలస) - క్విజ్
- ఎస్. హేమని (9వ తరగతి, జడ్పీహెచ్ఎస్, చింతలపేట) - క్విజ్

గజపతినగరం

- జి. ఇందు (ద్వితీయ ఇంటర్ ఎంపీసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గజపతినగరం) - క్విజ్
- జి. నాని (ద్వితీయ ఇంటర్ హెచ్ఈసీ, ప్రభుత్వ జూనియర్ కళాశాల, గజపతినగరం) - వ్యాసరచన
- పి. శ్రీవల్లి (9వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బొండపల్లి) - వ్యాసరచన

నెల్లిమర్ల

- కె. శరత్ చంద్రిక (ఇంటర్, సీకేఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల, నెల్లిమర్ల) - వ్యాసరచన
- జి. పైడినాయుడు (ఇంటర్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, డెంకాడ) - క్విజ్
- డి. శ్రీనిధి (9వ తరగతి, జడ్పీహెచ్ఎస్, భోగాపురం) - వ్యాసరచన

విజయనగరం

- ఎం. హారిణి (7వ తరగతి, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, బాబామెట్ట) - క్విజ్
- ఆర్. భానుప్రసాద్ (10వ తరగతి, ఏపీ మోడల్ స్కూల్, విజయనగరం) - క్విజ్
- పి. ప్రణీత్ కుమార్ (10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, జొన్నవలస) - వ్యాసరచన
- కె. బంగారు లక్ష్మి (10వ తరగతి, జడ్పీహెచ్ఎస్, గుంకలాం) - వ్యాసరచన

శృంగవరపుకోట

- జె. బుజ్జిబాబు (బీఏ తృతీయ సంవత్సరం, పొలిటికల్ సైన్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్.కోట) - క్విజ్
- పి. జాన్ (బీఏ తృతీయ సంవత్సరం, ఎకనామిక్స్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్.కోట) - క్విజ్
- పి. ఉజ్వల జ్యోతి (ఇంటర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎస్.కోట) - వ్యాసరచన

ఈవీఎం భద్రతా గిడ్డంగి వద్ద నిరంతర నిఘా ఉండాలి



- **ఈవీఎం గోడౌన్ సీల్స్, సీసీ కెమెరాల నిఘా పరిశీలన**
- **జిల్లా కలెక్టర్ డా. ఎన్. ప్రభాకర రెడ్డి**

పార్వతీపురం జిల్లా ప్రతినిధి, నవంబర్ 27 మనసులో మాట :

ఈవీఎం భద్రతా గిడ్డంగి వద్ద విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకర రెడ్డి స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని ఈవీఎం, వీవీప్యాట్ భద్రతా గిడ్డంగిని కలెక్టర్ సమగ్రంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం నెలవారీ తనిఖీల్లో భాగంగా ఈ పరిశీలన చేపట్టినట్లు వెల్లడించారు. గోడౌన్ వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీ నిఘా వ్యవస్థ, పోలీసు బందోబస్తును పరిశీలించిన ఆయన సంబంధిత రిజిస్టర్లను తనిఖీ చేసి, భద్రతా సిబ్బంది 24 గంటలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. గోడౌన్ సీల్స్ సక్రమంగా ఉన్నాయని ధృవీకరించుకున్న అనంతరం, గోడౌన్‌లో తగినంత గాలి, వెలుతురు ఉండేలా చూడాలని, తేమ చేరకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీ కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి కె.హేమలత, పార్వతీపురం సబ్ కలెక్టర్ సచిన్ అచ్చితా రహోర్, మునిసిపల్ కమీషనర్ రాంగోపాల్, తహసీల్దార్, రెవెన్యూ మరియు ఎన్నికల విభాగానికి చెందిన అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైస్ చైర్మన్ దంపతులకు నీలమ్మ కాలనీ సచివాలయ ఉద్యోగుల సత్కారం

పాలకొండ, నవంబర్ 27, మనసులో మాట :



పాలకొండ నగర పంచాయతీ వైస్ చైర్మన్ గుమ్మడి దమయంతి, ఆమె భర్త, తెలుగుదేశం పార్టీ పాలకొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మడి సింహాద్రి దంపతులను నీలమ్మ కాలనీ సచివాలయ ఉద్యోగులు మర్యాదపూర్వకంగా వారి స్వగృహంలో కలిశారు. ఈ సందర్భంగా దంపతులకు శాలువా కప్పి ఘనంగా సన్మానించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొని తమ గౌరవాభిమానాలను తెలియజేశారు.

కంచరపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సీపీ



ఎన్పడి, మనసులో మాట, నవంబర్ 27:

పోలీస్ కమిషనర్ డా. శంఖబ్రత బాగ్చి గురువారం సాయంత్రం కంచరపాలెం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా గతంలో నిర్వహించిన తనిఖీకి సంబంధించిన ఇన్‌స్పెక్షన్ నోట్‌ను పరిశీలించిన అనంతరం పోలీస్ స్టేషన్‌లోని వివిధ విభాగాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. స్టేషన్ ప్రాంగణం, పరిసర ప్రాంతాలతో పాటు అన్ని మరుగుదొడ్లను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లో నమోదైన కేసుల దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్‌లో ఎల్లవేళలా తగినంత సిబ్బంది అందుబాటులో ఉండేలా చూడాలని, విధులకు సంబంధించిన అన్ని రిజిస్టర్లను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా నిర్వహించాలని సీపీ ఆదేశించారు. స్టేషన్ నిర్వహణ, కేసుల దర్యాప్తు, ప్రజలకు అందుతున్న సేవల విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా విధులు నిర్వహించాలని సూచించారు. అనంతరం క్రైమ్ పోలీస్ స్టేషన్ కూడా సిపి సందర్శించారు. సీపీ తనిఖీ సమయంలో కంచరపాలెం సీఐ కోరాడ రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నిర్మూలనతో బంగారు భవిష్యత్తు... శిశు సంక్షేమ అధికారి శోభారాణి...

ఎచ్చెర్ల, నవంబర్ 27. (మనసులో మాట)



బాలికల ఆరోగ్యము, భద్రత బంగారు భవిష్యత్తుకు బాల్యవివాహాలు నిర్మూలించడమే తోనే సాధ్యమని స్త్రీ శిశు సంక్షేమ శాఖ అధికారిణి పి. శోభారాణి అన్నారు.. అంతర్జాతీయ బలవంతపు వివాహాల నిర్మూలన దినోత్సవ సందర్భంగా శుక్రవారం చిలకపాలెం దరి శివాని కళాశాల ఆవరణలో గల ట్రిపుల్ ఐటి క్యాంపస్‌లో విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రతిజ్ఞ ఆమె చేయించారు. బాల్య వివాహాలు ముక్తభారత్ వంద రోజులు ప్రచార కార్యక్రమంలో భాగంగా ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాల్గొని ఆమె మాట్లాడారు. అంతేకాక చిన్న వయసులో వివాహాల వల్ల బాలికలు శారీరకంగా, మానసికంగా, అనేక ఇబ్బందులుతో పాటు అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొగలరని అన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, ఈ చట్టం కింద కఠిన చర్యలు తీసుకునేందుకు అవకాశం ఉందని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్. బి. ఎస్.కె సమన్వయ కర్త, వైద్యాధికారి అరబింద్, విద్యాశాఖ జి సి డి ఓ ఉమా, ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ రామకృష్ణ, ఎచ్చెర్ల పి. హెచ్ సి కమ్యూనిటీ అధికారి రమేష్ బాబు, డి ఎం సి ఉమా మహేశ్వరి, సి డబ్ల్యూ సి సభ్యులు విజయభాస్కర్ జాస్మిన్ కుమార్,, మండల విద్యాధికారి,, జిల్లా బాలల రక్షణ విభాగం అధికారులు పాల్గొన్నారు.

పొగాకు రహిత సమాజానికి యువతే కీలకం :జిల్లా ఎన్.సి డి అధికారి డాక్టర్ జగన్ మోహన్



పార్వతీపురం జిల్లా ప్రతినిధి , నవంబర్27 మనసులో మాట :

పొగాకు రహిత సమాజ స్థాపనలో అందరూ భాగస్వాములు కావాలని, ముఖ్యంగా యువతే కీలకమని జిల్లా అసంక్రమిత వ్యాధుల నియంత్రణ అధికారి డాక్టర్ టి. జగన్ మోహన రావు అన్నారు. టొబాకో ఫ్రీ యూత్ క్యాంపెయిన్ 4.0 లో బాగంగా మరి పివలస, పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ జగన్ మోహన్ వైద్య బృందంతో కలిసి పాల్గొని కార్యక్రమ ఉద్దేశ్యం,లక్ష్యం పై పవర్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. పొగాకు ఉత్పత్తులు సిగరెట్, చుట్ట, ఖైనీ, గుట్కా, తంబాకు తదితర వ్యసనాలతో ఆరోగ్యం పై తీవ్రమైన ప్రభావం పడుతుందని, శరీరంలో ముఖ్యమైన అవయవాల పనితీరు క్షీణిస్తుందన్నారు. క్యాన్సర్ కారకాల్లో ప్రధానమైనది పొగాకు అని , అలాగే ఊపిరితిత్తులు, దృష్టి సమస్యలు, పక్షవాతం , పునరుత్పత్తి సామర్థ్యం తగ్గిపోవడం తదితర సమస్యలకు దారి తీస్తుందన్నారు. యువత వీటికి బానిస కాకుండా ఆరోగ్యకర మైన జీవనశైలిని అలవర్చుకోవాలని సూచించారు. శాఖల సమన్వయంతో వీటిపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కోట్పా యాక్ట్ ప్రకారం విద్యాసంస్థల ప్రాంగణంలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలు నిషిద్ధమని, ఇందుకు సంబంధించి టోఫీ ప్రోగ్రాం ను వైద్య సిబ్బంది అన్ని స్కూల్స్ లో డిసెంబర్ నెలాఖరులోగా పూర్తి చేసి వివరాలు అప్లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సి.హెచ్. ధర్మతేజ, ఎన్.టి.సి.పి కౌన్సిలర్ భవాని, డి.ఎం.హెచ్.పి కౌన్సిలర్ కృష్ణారావు, వైద్య సిబ్బంది సుశీల, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట ఏర్పాట్లు

- **ఎన్నికల అధికారి డాక్టర్ స్వామి నాయుడు**

అనంతగిరి, నవంబర్ 27 మనసులో మాట



అల్లూరి జిల్లా అనంతగిరి మండలంలో గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికలను పారదర్శకంగా, నిర్వహించేందుకు పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు ఎన్నికల నిర్వహణ అధికారి డాక్టర్ స్వామి నాయుడు తెలిపారు.

మండలంలోని రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎన్నికల సన్నద్ధత, పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది నియామకం, రవాణా, భద్రత, బ్యాలెట్ బాక్సులు, ఎన్నికల సామగ్రి పంపిణీ తదితర అంశాలపై సమగ్ర కార్యాచరణ రూపొందించినట్లు వెల్లడించారు.

మండలంలో మొత్తం 24 గ్రామ పంచాయతీ సర్పంచ్ స్థానాలు, 232 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి 232 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు ఈ ఎన్నికల్లో మొత్తం 38,286 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని వీరిలో 18,786 మంది పురుషులు, 19,499 మంది మహిళలు, ఒకరు ఇతర ఓటర్లు ఉన్నారు.

పోలింగ్ కేంద్రాల భద్రతాపరమైన ఏర్పాట్లలో భాగంగా 40 సున్నితమైన పోలింగ్ కేంద్రాలను గుర్తించారు. వీటిలో పెదకోట, పినకోట, జీనబాడు, గుమ్మకోట గ్రామాలకు చెందిన పది చొప్పున పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. అత్యంత సున్నితమైన, సమస్యాత్మక, ఎల్‌డబ్ల్యూఈ పోలింగ్ కేంద్రాలు లేవని నివేదికలో పేర్కొన్నారు.

ఎన్నికల విధుల్లో ఉన్న సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకోవాలి

- **నవంబర్ 30న సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రత్యేక సదుపాయం**
- **ఉదయం 10.30 నుంచి సాయత్రం 5 గంటల వరకు అవకాశం : జిల్లా కలెక్టర్ అభిషిక్త్ కిశోర్**

విశాఖపట్టణం, నవంబర్ 27 (మనసులో మాట) :



మూడో విడతలో భాగంగా జిల్లాలో డిసెంబర్ 02న జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల్లో నియమితులైన, విశాఖపట్నం గ్రామీణ ప్రాంతానికి చెందిన అర్హులైన ఎన్నికల సిబ్బంది తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసే అవకాశం కల్పించినట్లు జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఈ నెల 30వ తేదీన ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు సంబంధిత ఎంపీడీవో కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న అర్హులైన సిబ్బంది తమకు కేటాయించిన సంబంధిత ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించి, నిర్దేశించిన సమయంలో పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటన ద్వారా సూచించారు.

ఏకగ్రీవ సర్పంచ్ పితాన అప్పన్నకు హోంమంత్రి అనిత అభినందనలు

- **పేటసూదిపురం అభివృద్ధికి ప్రజలందరినీ కలుపుకొని ముందుకు సాగాలి**

నక్కపల్లి, నవంబరు 27 (మనసులో మాట):



ఎస్.రాయవరం మండలం పేటసూదిపురం గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైన పితాన అప్పన్నకు రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం నక్కపల్లి మండలంలోని హోంమంత్రి క్యాంపు కార్యాలయంలో పేటసూదిపురం గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన సర్పంచ్ పితాన అప్పన్నను హోంమంత్రి అనిత ప్రత్యేకంగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. గ్రామ ప్రజలు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ పార్టీలకు అతీతంగా ప్రజలందరినీ కలుపుకొని గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పేటసూదిపురం గ్రామ కూటమి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలి

- **క్షేత్రస్థాయి అవగాహన, తక్షణ సమాచారంతోనే అడ్డుకట్ట సాధ్యం**
- **జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డా. ఎ. కృష్ణ ప్రసాద్**

విజయనగరం, నవంబర్ 27 (మనసులో మాట):





అందరి సమష్టి కృషితోనే బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నిర్మూలించవచ్చని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి డా. ఎ. కృష్ణ ప్రసాద్ అన్నారు. జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా స్థాయి 'బాల్య వివాహ రహిత భారత్' అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న డా. ఎ. కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ, బాల్య వివాహాలు బాలల హక్కులకు భంగం కలిగించడమే కాకుండా వారి విద్య, ఆరోగ్యం, మానసిక వికాసం మరియు భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. చిన్న వయస్సులో వివాహాలు చేయడం వల్ల బాలికలు ఉన్నత విద్యను కొనసాగించడానికి, స్వతంత్రంగా ఎదగడానికి ఆటంకం కలుగుతుందని పేర్కొన్నారు. బాల్య వివాహాల నిర్మూలనకు చట్టాలపై అవగాహన పెంపొందించడంతో పాటు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. బాలలు సురక్షితమైన వాతావరణంలో ఎదిగి, సరైన వయస్సులో తమ జీవిత నిర్ణయాలను స్వేచ్ఛగా తీసుకునే హక్కు కలిగి ఉన్నారని వివరించారు. ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే వెంటనే సంబంధిత అధికారులకు గానీ, న్యాయ సేవాధికార సంస్థ టోల్ ఫ్రీ నంబర్ 15100 కు గానీ కాల్ చేసి సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. జిల్లా మహిళా, శిశు సంక్షేమ అధికారిని కె.వి. బాలమణి మాట్లాడుతూ, 'బాల్య వివాహ ముక్త్ భారత్ అభియాన్'లో భాగంగా కేంద్ర ప్రభుత్వం అక్టోబర్ 21, 2026 నుండి డిసెంబర్ 21, 2026 వరకు 100 రోజుల ప్రత్యేక ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని తెలిపారు. గ్రామాల్లో వివిధ కారణాలతో జరుగుతున్న బాల్య వివాహాల వల్ల బాలికలు చిన్న వయసులోనే గర్భం దాల్చి రక్తహీనత, పోషకాహార లోపం, ప్రసవ సంబంధిత సమస్యలు మరియు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, ఇది తల్లి మరియు శిశువు ప్రాణాలకు ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. బాల్య వివాహాల నిరోధానికి జిల్లా స్థాయిలో జిల్లా కలెక్టర్, డివిజన్ పరిధిలో ఆర్డీవోలు, మండల పరిధిలో తహశీల్దార్లు నియమించబడ్డారని, గ్రామస్థాయిలో 'చైల్డ్ వెల్ఫేర్ అండ్ ప్రొటెక్షన్ కమిటీ'లను ఏర్పాటు చేశామని వివరించారు. 'బాల్య వివాహాల నిషేధ చట్టం 2006' ప్రకారం 18 సంవత్సరాలు నిండని బాలికకు, 21 సంవత్సరాలు నిండని బాలుడికి వివాహం చేయడం నేరమని; వివాహం జరిపించేవారు, ప్రోత్సహించేవారు మరియు సహకరించేవారు చట్టపరమైన చర్యలకు గురవుతారని హెచ్చరించారు. బాల్య వివాహాలపై ముందస్తు సమాచారం తెలిస్తే టోల్ ఫ్రీ నంబర్లు 1098, 181, 112 లకు గానీ, న్యాయ సహాయం కోసం 15100 కు గానీ తెలియజేయాలని కోరారు.

ఈ సందర్భంగా జిల్లా స్థాయిలో నిర్వహించిన వక్తృత్వ పోటీలలో విజేతలుగా నిలిచిన కుమారి అంజలి, కుమారి హర్షిని, కుమారి చాందినీలకు అతిథులు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సమావేశంలో మెప్మా పీడీ చిట్టిరాజు, డీఈవో కార్యాలయ ఏడీ అరుణ జ్యోతి, అడిషనల్ డీఎం అండ్ హెచ్ఓ సూర్యనారాయణ, డీఆర్‌డీఏ నుండి గీత, మహిళా పోలీస్ ఎస్ఐ శిరీష, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఎన్జీవో ప్రతినిధి ఝాన్సీ, వైసీపీ ఎన్జీవో ప్రతినిధి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రెండో విడత పంచాయతీ ఎన్నికలకు 1,600 మంది పోలీసులతో బందోబస్తు!

- 244 గ్రామ పంచాయతీలు.. 2,271 వార్డుల్లో ఎన్నికలు
- 53 హైపర్ సెన్సిటివ్, 86 సెన్సిటివ్ పోలింగ్ లొకేషన్ల గుర్తింపు
- 95 రూట్ మొబైల్స్.. 20 స్టైకింగ్ ఫోర్సులు ఏర్పాటు
- ప్రశాంత ఎన్నికల నిర్వహణకు పటిష్ట భద్రతా చర్యలు
- ఎస్పీ దామోదర్

విజయనగరం, నవంబరు 27 (మనసులో మాట):



విజయనగరం జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నవంబరు 29న పది మండలాల పరిధిలో జరగనున్న ఎన్నికలు ప్రశాంతంగా,నిష్పక్షపాతంగా,పారదర్శకంగా నిర్వహించేందుకు భారీస్థాయిలో పోలీసు బందోబస్తును సిద్ధం చేసింది.మొత్తం 244గ్రామ పంచాయతీలు, 2,271 పంచాయతీ వార్డుల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు సుమారు 1,600 మంది పోలీసు సిబ్బందిని విధుల్లో వినియోగించనున్నట్లు జిల్లా ఎస్పీ ఎ.ఆర్. దామోదర్, ఐపీఎస్ వెల్లడించారు. రెండో విడతలో గంట్యాడ, జామి, బొండపల్లి, దత్తిరాజేరు, గజపతినగరం, మెంటాడ, ఆర్.ఎ.వలస, వంగర, సంతకవిటి, రాజాం మండలాల్లో ఎన్నికలు జరగనున్నాయి. జిల్లా వ్యాప్తంగా మొత్తం 306పోలింగ్ లొకేషన్లను గుర్తించగా, వాటిలో 53 హైపర్ సెన్సిటివ్, 86 సెన్సిటివ్, 167 సాధారణ పోలింగ్ లొకేషన్లుగా వర్గీకరించినట్లు ఎస్పీ తెలిపారు. ఆయా ప్రాంతాల్లో పరిస్థితులకు అనుగుణంగా అదనపు భద్రతా చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. ఎన్నికల బందోబస్తు కోసం పది మండలాల్లో 95 రూట్ మొబైల్స్‌ను ఏర్పాటు చేయడంతోపాటు, అదనంగా 20 స్టైకింగ్ ఫోర్సులు, 10 స్పెషల్ స్టైకింగ్ ఫోర్సులు, ఐదు జోనల్ స్టైకింగ్ ఫోర్సులను రంగంలోకి దించనున్నట్లు వివరించారు. సమస్యాత్మక ప్రాంతాలపై ప్రత్యేక నిఘా ఉంచి, ఎక్కడైనా అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నవంబరు 29న ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 2 గంటల తర్వాత అదే పోలింగ్ లొకేషన్‌లోని కేంద్రంలో ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రారంభమవుతుందని ఎస్పీ వెల్లడించారు. మండల కేంద్రాల్లోని డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల నుంచి ఎన్నికల సామగ్రిని తీసుకెళ్లే పోలీసు సిబ్బంది, పోలింగ్ సిబ్బందికి ఎస్కార్ట్‌గా వ్యవహరిస్తూ సురక్షితంగా కేంద్రాలకు చేరుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల చుట్టూ 100 మీటర్ల పరిధిని గుర్తించి, సుద్దతో మార్కింగ్ చేయాలని, ఓటు వేసేందుకు వచ్చే వారిని మినహాయించి ఇతర వ్యక్తులను ఆ పరిధిలోకి అనుమతించరాదని స్పష్టం చేశారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ప్రజలు గుంపులుగా చేరకుండా చూడాలని, విధుల్లో ఉండే ప్రతి పోలీసు సిబ్బంది తప్పనిసరిగా లాఠీ, విజిల్‌తోపాటు పబ్లిక్ అడ్రస్ సిస్టం లేదా బెల్ హెల్మర్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. సెక్షన్ 30 పోలీసు చట్టం, 144 సీఆర్పీసీ/163 బీఎన్ఎస్ఎస్ నిబంధనలు అమల్లో ఉన్న విషయాన్ని ప్రజలకు ముందుగానే తెలియజేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది ఎలాంటి ఉద్రిక్తతలకు తావివ్వకుండా సంయమనంతో వ్యవహరించాలని, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని ఎస్పీ దామోదర్ దిశానిర్దేశం చేశారు. ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసు శాఖకు ప్రజలు సహకరించాలని, ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి – జిల్లా కలెక్టర్

పార్వతీపురం జిల్లా ప్రతినిధి
నవంబర్ 27 మనసులో మాట :



జిల్లాలో రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. ఎన్. ప్రభాకర రెడ్డి, ఐ.ఏ.ఎస్., తెలిపారు. ఈ విడతలో పాలకొండ, వీర ఘట్టం, సీతంపేట, భామిని మండలాల్లో ఎన్నికలు జరుగనున్నాయి.
ఈ నాలుగు మండలాల పరిధిలో మొత్తం 146 గ్రామ పంచాయతీలు, 1274 వార్డులు ఉన్నాయి. వీటిలో 32 సర్పంచ్ స్థానాలు, 555 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మిగిలిన 114 గ్రామ పంచాయతీల సర్పంచ్ స్థానాలకు, 719వార్డు సభ్యుల స్థానాలకు పోలింగ్ జరగనుంది. సర్పంచ్ స్థానాలకు 285 మంది, వార్డు సభ్యుల స్థానాలకు 1542 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు.
రెండో విడతలో మొత్తం 172951 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరిలో పురుషులు 84119 మంది, మహిళలు 88818 మంది, ఇతరులు 14 మంది ఉన్నారు.
ఎన్నికల నిర్వహణకు 2981 మంది పోలింగ్ సిబ్బందిని నియమించారు. పోలింగ్ జరిగే అన్ని గ్రామ పంచాయతీల్లో సీసీ కెమెరాల ద్వారా పోలింగ్ ప్రక్రియను పర్యవేక్షించేందుకు ఏర్పాట్లు చేశారు.

సింహాద్రి అప్పన్నను దర్శించుకున్న రామచంద్ర జీయర్ స్వామి





సింహాచలం, నవంబరు 27 (మనసులో మాట) :

పరమ పవిత్ర పుణ్యక్షేత్రమైన సింహాచల క్షేత్రం శుక్రవారం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. శ్రీశ్రీశ్రీ త్రిదండి శ్రీమన్నారాయణ రామచంద్ర జీయర్ స్వామివారు సింహాద్రి అప్పన్నను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయ మర్యాదలతో ప్రధాన అర్చకులు శ్రీనివాసాచార్యులు, సహాయ కార్యనిర్వహణాధికారి పాలూరి నర్సింగరావు స్వామీజీకి స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు వేద మంత్రోచ్చారణల మధ్య వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి శ్రీవారి చిత్రపటాన్ని జ్ఞాపికగా బహూకరించారు.

పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో ఓటు వేసిన 206 మంది ఉద్యోగులు

గంట్యాడ, నవంబర్ 27 (మనసులో మాట):





రెండవ విడత గ్రామ పంచాయతీ సాధారణ ఎన్నికల్లో భాగంగా గంట్యాడ మండలంలో శుక్రవారం నిర్వహించిన పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ లో 206 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. గంట్యాడ మండలంలో నవంబర్ 29వ తేదీన జరగనున్న గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి, ఎన్నికల విధులు నిర్వహించే ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ సౌకర్యాన్ని వినియోగించుకునేందుకు వీలుగా గంట్యాడ మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఫెసిలిటేషన్ సెంటర్ ను అధికారులు శుక్రవారంఏర్పాటు చేయడం జరిగింది. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామ పంచాయతీలకు చెందిన ఎన్నికల విధులు నిర్వహిస్తున్న సిబ్బంది తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారు.
పోస్టల్ బ్యాలెట్ ప్రక్రియలో మొత్తం 206 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు గంట్యాడ మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆర్.వి. రమణమూర్తి తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనతోనే బంగారు భవిష్యత్తు.. సిడిపిఓ వై లావణ్య పిలుపు

అనంతగిరి నవంబర్ 27 మనసులో మాట



బాల్య వివాహాలను పూర్తిగా నిర్మూలించి, బాలికల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని అనంతగిరి మండల సిడిపిఓ వై. లావణ్య పిలుపునిచ్చారు. ఐక్యరాజ్యసమితి పిలుపు మేరకు 'అంతర్జాతీయ బాల్య వివాహాల నిర్మూలన దినోత్సవం' సందర్భంగా శుక్రవారం అనంతగిరి మండలం కొత్తూరు పంచాయతీలోని కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిడిపిఓ వై. లావణ్య మాట్లాడుతూ, 2030 నాటికి బాల్య వివాహాలు లేని భారతదేశాన్ని నిర్మించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. దేశవ్యాప్తంగా అక్టోబర్ 21 నుండి డిసెంబర్ 21 వరకు 100 రోజుల పాటు 'బాల్ వివాహ్ ముక్త్ భారత్' ప్రత్యేక క్యాంపెయిన్ కొనసాగుతోందని వివరించారు. ఇందులో భాగంగా గ్రామ, మండల స్థాయిలో ర్యాలీలు, ప్రత్యేక అసెంబ్లీలు నిర్వహిస్తూ ప్రజల్లో చైతన్యం తెస్తున్నట్లు తెలిపారు. బాలికలు చదువుపై దృష్టి సారించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తక్షణమే అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం విద్యార్థినులతో బాల్య వివాహాల నిర్మూలన ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చిలకలగడ్డ సెక్టార్ సూపర్వైజర్ కృష్ణవేణి, కేజీబీవీ పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సుశీల, ఉపాధ్యాయ సిబ్బంది, అంగన్వాడీ కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థినులు పాల్గొన్నారు.



మల్యాపురం (మనసులో మాట)

తాడేపల్లి వైసిపి సెంట్రల్ కార్యాలయంలో వైఎస్ఆర్సిపి రథసారథి, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని శుక్రవారం, విశాఖపట్నం తూర్పు నియోజకవర్గం ఇంచార్జ్ మొల్లి సన్యాసిరావు, వార్డ్ సీనియర్ నాయకులు, "వాసు క్యాటరింగ్ అధినేత"వాసు, వైయస్ జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసిన దృశ్యం..